యువగళం పాదయాత్రలో నిరుద్యోగుల కష్టాలను చూసిన మా నాయకుడు నారా లోకేష్ 20 లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చారు. నేడు 24 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. యువత ఉపాధి కోసం విదేశీ పర్యటనలు చేస్తుంటే విమర్శించడం ప్రతిపక్షాల అవగాహనారాహిత్యమే.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 15.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 175 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00




## స్థానిక పోరులో కూటమిగానే

- సీట్ల సర్దుబాటుపై చర్చలు కొలిక్కి
- రెండు రోజుల్లో కూటమి అభ్యర్థుల ప్రకటన
- ఎక్కడ ఎవరి బలం ఉంటే.. అక్కడ వారికే అవకాశం
- గెలుపే లక్ష్యంగా పార్టీల ఉమ్మడి వ్యూహం

**అమరావతి, అక్టోబర్ 14:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు కొలిక్కి వచ్చాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన విధానాన్నే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగిస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేయనున్నట్లు జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి తెలిపారు.
కూటమి పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవని బొలిశెట్టి స్పష్టం చేశారు. ఏ పార్టీకి ఎక్కడ బలం ఉంటే అక్కడ ఆ పార్టీ అభ్యర్థులు పోటీ చేసేలా సీట్ల సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు. పర్సంటేజీలు, సీట్ల రేషియోపై కాకుండా ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కూటమి పార్టీలు పనిచేస్తాయని పేర్కొన్నారు.
కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యం ఇస్తూ స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. రెండు రోజుల్లో జనసేన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని, పార్టీ పరంగా కాకుండా కూటమి అభ్యర్థులుగా వారిని ప్రకటించే విధానాన్ని అనుసరిస్తామని బొలిశెట్టి వెల్లడించారు.



## స్థానిక ఎన్నికల నగారా

- స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల
- అక్టోబరు 28న మున్సిపల్ ఎన్నికలు.. నవంబరు 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్
- నవంబరు 26, 29, డిసెంబరు 2న మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

**అమరావతి, అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి తెరలేచింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా స్థానిక సంస్థల ఎన్నికల పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించారు. షెడ్యూల్ విడుదలైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది.
ఈ రోజు నుంచి డిసెంబరు 2 వరకు వివిధ దశల్లో ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. పురపాలక సంస్థలకు సంబంధించి 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు అక్టోబరు 28న పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబరు 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబరు 19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుంది. అక్టోబరు 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.
ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబరు 19న నోటిఫికేషన్ విడుదల కానుంది. మిగతా 2లో...

## ఎన్నికల కోడ్ ఎన్నికల కోడ్

- ప్రభుత్వానికి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు
- కొత్త పథకాలు, నిధుల మంజూరుకు బ్రేక్
- ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నేతల ఫ్లెక్సీలు తొలగింపు
- ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

2 లో

## ఇంద్రకీలాద్రిపై రాష్ట్రపతి ముర్ము

### కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు.. భక్తులకు అభివాదం



**విజయవాడ, అక్టోబర్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు హోంమంత్రి అనిత, ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి అమ్మవారి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
పూజల అనంతరం అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, శేష వస్త్రం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయం నుంచి బయటకు వచ్చిన రాష్ట్రపతి క్యూలైన్లలో ఉన్న భక్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. - 2లో...

## జనసేనలోకి వంగవీటి రాధా



2 లో

- పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిక
- విజయవాడ మేయర్ పదవిపై రాజకీయ వర్గాల్లో చర్చ
- జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగుతారంటూ ప్రచారం

## విజయనగరానికి జల'వరం'

- 454 చెరువుల పునరుద్ధరణకు రూ.22.14 కోట్లు
- పూడిక తొలగింపు.. కాలువల బాగు.. స్లూయిస్ గేట్ల మరమ్మతులు
- వందలాది గ్రామాలకు తీరనున్న తాగు, సాగునీటి కష్టాలు
- వినతులపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**విజయనగరం అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):** విజయనగరం జిల్లా తాగు, సాగు నీటి అవసరాలు తీర్చే నిమిత్తం వెంటనే చేయాల్సిన పనులపై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి సారించారు. ఉప ముఖ్యమంత్రివర్యుల కార్యాలయానికి విజయనగరం జిల్లా నుంచి వచ్చిన వివిధ వినతులను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ. 22.14 కోట్లతో చెరువుల పునరుద్దరణ పనులు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆమోదం తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వి బి జి రామ్ జి పథకంలో భాగంగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ. 205.69 కోట్లు జిల్లాకు అందుబాటులో ఉన్న నేపథ్యంలో వాటిని ఉపయోగించి జిల్లాలో మొత్తం 454 చెరువులకు జీవం పోయనున్నారు. చెరువుల్లో పూడిక తొలగించి, పునరుద్ధరణ చేయడంతోపాటు నీరు సరఫరా అయ్యే కాలువలు పునరుద్ధరణ, స్లూయిస్ గేట్లకు మరమ్మతులు చేయనున్నారు. 454 చెరువులకు సరికొత్త కళ తెచ్చేలా ఈ పనులు వెంటనే మొదలు కానున్నాయి. ఈ పనుల వల్ల విజయనగరం జిల్లాలోని వందలాది గ్రామాలకు తాగు, సాగునీటి కొరత తీరుతుంది.

## షిప్ బిల్డింగ్ హబ్‌గా ఏపీ



- దుగరాజపట్నం, మచిలీపట్నంలో భారీ నౌకా నిర్మాణ కేంద్రాలు
- రూ.23 వేల కోట్ల పెట్టుబడులు.. 5,520 ఎకరాల్లో షిప్‌బిల్డింగ్ క్లస్టర్లు

**అమరావతి, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో కీలక నౌకా నిర్మాణ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. దుగరాజపట్నం, మచిలీపట్నం గేట్‌వే పోర్టుల్లో భారీ నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రాల ఏర్పాటుకు ప్రముఖ సంస్థలు ముందుకొచ్చాయి. మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్), గోవా షిప్‌యార్డు లిమిటెడ్ కలిసి సుమారు రూ. 23 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. కాకినాడ పోర్టులోనూ మరో షిప్‌బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటుకు సంస్థలతో ప్రభుత్వం చర్చలు కొనసాగిస్తోంది.
మూడు పోర్టుల పరిధిలో మొత్తం 5,520 ఎకరాల్లో నౌకా నిర్మాణ క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రంలో ఏటా సుమారు 2.9 మిలియన్ గ్రాస్ టన్నుల నౌకా నిర్మాణ, మరమ్మతుల సామర్థ్యం అందుబాటులోకి రానుంది. నౌకా నిర్మాణంతో పాటు అనుబంధ పరిశ్రమలు, మెరైన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, భారీ యంత్రాల తయారీ కేంద్రాలు ఏర్పడే అవకాశం ఉంది.
**దుగరాజపట్నంలో రూ.15 వేల కోట్ల ప్రాజెక్టు :** దుగరాజపట్నంలో నేషనల్ షిప్‌బిల్డింగ్, మిగతా 2లో...

## ఇమామ్‌లు, మౌజన్లకు ఊరట

- మూడు నెలల గౌరవ వేతనంగా రూ.22.45 కోట్లు విడుదల
- 4,991 మంది ఇమామ్‌లు.. మరో 4,991 మంది మౌజన్లకు లబ్ధి
- 27 నెలల్లో ఇప్పటివరకు రూ.202 కోట్లు చెల్లింపు

**అమరావతి, అక్టోబర్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని మసీదుల్లో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మౌజన్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు నెలల గౌరవ వేతనాన్ని విడుదల చేసింది. మొత్తం 9,982 మందికి రూ. 22.45 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీరిలో 4,991 మంది ఇమామ్‌లు, 4,991 మంది మౌజన్లు ఉన్నారు. మిగతా 2లో...

## దసరా భద్రతకు హైటెక్ నిఘా

- ఇంద్రకీలాద్రిపై ఏఐ ఆధారిత రద్దీ విశ్లేషణ వ్యవస్థ
- డ్రోన్లు, సీసీ కెమెరాలతో క్యూలైన్లు, ఘాట్ రోడ్ల పర్యవేక్షణ
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు
- ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా



● వివరాలు 2 లో

## సారస్ మేళాకు సర్వం సిద్ధం

- సారస్ ఆజీవికా మేళా ఏర్పాట్లను పరిశీలించిన పెమ్మసాని
- ప్రారంభించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- డ్వాక్రా మహిళలకు ఉత్పత్తుల మార్కెటింగ్, బ్రాండింగ్‌పై శిక్షణ



**విజయవాడ, అక్టోబర్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలో ప్రారంభం కానున్న జాతీయ సారస్ ఆజీవికా మేళా-2026 ఏర్పాట్లను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్)తో కలిసి బుధవారం పరిశీలించారు. అక్టోబర్ 15 నుంచి 31 వరకు జరగనున్న ఈ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు.
దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసే నాణ్యమైన ఆహార పదార్థాలు, హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తులను మేళాలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు.
ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డ్వాక్రా మహిళలకు సారస్ మేళాలో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించినట్లు పెమ్మసాని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను పెద్ద మార్కెట్లకు తీసుకెళ్లేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునేలా మేళా వేదికగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఉత్పత్తులకు సరైన బ్రాండింగ్, ప్యాకేజింగ్ చేయడం, రవాణాకు అనువుగా తయారు చేయడం, ఆన్‌లైన్ రిటైలర్లతో అనుసంధానం కావడం వంటి అంశాలపై ప్రతిరోజూ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌లో విక్రయించుకునే అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. మిగతా 2లో...

# జనసేనలోకి వంగవీటి రాధా



**అమరావతి, అక్టోబర్ 14:** మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా ఆయనతో కలిసి జనసేనలో చేరారు. అమరావతిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

వంగవీటి రాధాకృష్ణ 2004లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పటి నుంచి టీడీపీలో కొనసాగుతున్న ఆయన తాజాగా జనసేనలో చేరడంతో విజయవాడ రాజకీయాల్లో చర్చకు దారితీసింది.

విజయవాడ నగర మేయర్ పదవి ప్రస్తుతం అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలోకి వెళ్లింది. కూటమి పార్టీల మధ్య స్థానిక సంస్థల పదవుల పంపకంలో భాగంగా మేయర్ పదవి జనసేనకు దక్కే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

ఈ నేపథ్యంలో జనసేన తరఫున విజయవాడ మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణను బరిలోకి దింపే అవకాశం ఉందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే మేయర్ అభ్యర్థిత్వంపై జనసేన నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# స్థానిక ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబరు 23 వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుంది. అక్టోబరు 27న ఉపసంహరణ ప్రక్రియ ముగుస్తుంది. నవంబరు 3న పోలింగ్ నిర్వహించి, నవంబరు 5న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. తొలి విడతకు నవంబరు 13న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబరు 17 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబరు 21న ఉపసంహరణ పూర్తయ్యాక నవంబరు 26న పోలింగ్ జరుగుతుంది. రెండో విడతకు నవంబరు 18న నోటిఫికేషన్, నవంబరు 20 వరకు నామినేషన్లు, నవంబరు 24న ఉపసంహరణ, నవంబరు 29న పోలింగ్ నిర్వహిస్తారు. మూడో విడతకు నవంబరు 19న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబరు 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నవంబరు 27న ఉపసంహరణ అనంతరం డిసెంబరు 2న పోలింగ్ జరుగుతుంది.

ఎన్నికల షెడ్యూల్ ఖరారవడంతో రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ సందడి మొదలైంది. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలు, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించాయి. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ఎన్నికల ప్రక్రియ ఊపందుకోనుంది.

# ఎన్నికల కోడ్ అమల్లోకి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ లో తక్షణమే ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఆయన ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వం కొత్త సంక్షేమ పథకాలు, ఆకర్షణీయమైన ప్రకటనలు, ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి కొత్త ప్రాజెక్టులను ప్రకటించొద్దని తెలిపారు. అలాగే ప్రభుత్వం తరఫున నిర్వహించే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, కొత్త నిధుల మంజూరు వంటి కార్యక్రమాలను నిలిపివేయాలని సూచించారు. ప్రభుత్వ వాహనాలు, గెస్ట్ హౌస్‌లు, అధికారిక యంత్రాంగం, పబ్లిసిటీ మీడియాను రాజకీయ ప్రచారం కోసం ఉపయోగించకూడదని ఆదేశించారు. . అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, బస్సు షెల్టర్లు, జాతీయ రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న నాయకుల ఫ్లెక్సీలు, పోస్టర్లు, కటౌట్లను అధికారులు తక్షణమే తొలగించబడతాయని తెలిపారు. తమ అనుమతి లేకుండా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు ఇతర ప్రభుత్వ సిబ్బంది బదిలీలు చేయకూడదని అనిల్ చంద్ర పునేఠా హెచ్చరించారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం, అధికార యంత్రాంగం పూర్తిగా తమ పర్యవేక్షణలోకి తీసుకున్నట్లు అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

**నిబంధనలు తప్పనిసరి :** రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ప్రచార కార్యక్రమాలను నిర్వహించేటప్పుడు నిర్దిష్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పేర్కొన్నారు. మైకులు, లౌడ్ స్పీకర్ల వినియోగం, సభలు, సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు ముందస్తుగా పోలీసు, ఎన్నికల అధికారుల అనుమతి తీసుకోవాలని చెప్పారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం, అక్రమంగా డబ్బు, మద్యం, ఆభరణాల పంపిణీని అరికట్టడానికి రాష్ట్రవ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు తీవ్రతరం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలు కూడా ఉల్లంఘనలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ప్రత్యేక యాప్, ఫిర్యాదుల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు.

# షిప్ బిల్డింగ్ హబ్‌గా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)



ప్రత్యేక పోర్టు క్లస్టర్‌ను సుమారు రూ. 15 వేల కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేసేందుకు ఎండీఎల్ ముందుకొచ్చింది. కేంద్ర నౌకాయాన మంత్రిత్వశాఖ అమలు చేస్తున్న షిప్‌బిల్డింగ్ డెవలప్‌మెంట్ స్కీం కింద ప్రాజెక్టును చేపట్టనున్నారు. విద్యుత్, నీరు, అంతర్గత రహదారులు, డ్రైడాక్స్, గోదాములు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం నుంచి సహకారం అందనుంది. ప్రాజెక్టు అమలు, పర్యవేక్షణ కోసం విశాఖ పోర్టు అథారిటీ, ఏపీ మారిటైం బోర్డు సమాన భాగస్వామ్యంతో ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్పీవీ) ఏర్పాటు చేశాయి. దీనికి 'నేషనల్ షిప్‌బిల్డింగ్, హెవీ ఇండస్ట్రీస్ పార్కు-ఏపీ'గా పేరు పెట్టారు. సుమారు 2,170 ఎకరాల్లో నౌకా నిర్మాణ కేంద్రం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలను ఎండీఎల్ అభివృద్ధి చేయనుంది. డ్రైడాక్స్, బ్రేక్‌వాటర్లు, కార్గో హ్యాండ్లింగ్ పోర్టుతో పాటు నౌకల తయారీ, మరమ్మతులకు అవసరమైన స్టీల్ ప్లేట్లు, ఇంజిన్ విడిభాగాలు, పైపింగ్, ఎలక్ట్రికల్ పరికరాల తయారీ యూనిట్ల కోసం మరో 1,350 ఎకరాల్లో సదుపాయాలు కల్పించనున్నారు.

భారీ కంటైనర్ నౌకలు, రక్షణ రంగ నౌకలు, కేప్‌సైజ్ నౌకలు రాకపోకలు సాగించేలా 16 నుంచి 18 మీటర్ల లోతుతో నావిగేషన్ ఛానల్‌ను ఏర్పాటు చేయనున్నారు. దుగరాజపట్నం ప్రాజెక్టు ద్వారా ఏటా 1.2 మిలియన్ గ్రాస్ టన్నుల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా.

**మచిలీపట్నంలో రూ.8 వేల కోట్లతో షిప్‌యార్డు :** మచిలీపట్నంలో సుమారు 1,000 ఎకరాల్లో నౌకా నిర్మాణం, మరమ్మతుల హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం గోవా షిప్‌యార్డు లిమిటెడ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. సంస్థ సుమారు రూ. 8 వేల కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. భారీ నౌకల రాకపోకలకు అనువుగా 16 నుంచి 18 మీటర్ల లోతుతో నావిగేషన్ ఛానల్, ప్రత్యేక బెర్త్‌లను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా 0.5 మిలియన్ గ్రాస్ టన్నుల సామర్థ్యం అందుబాటులోకి రానుంది.

**కాకినాడలో మరో షిప్‌బిల్డింగ్ క్లస్టర్:** కాకినాడ గేట్‌వే పోర్టులోనూ సుమారు 1,000 ఎకరాల్లో షిప్‌బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనువైన సంస్థను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఎంపికయ్యే సంస్థ నౌకా నిర్మాణంతో పాటు మెరైన్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్యకలాపాలను చేపట్టనుంది. భారీ యంత్రాలు, ప్రొపెలర్లు, ఇంజిన్లు, పైపింగ్ వంటి పరికరాల తయారీకి అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కాకినాడ పోర్టుకు ఉన్న సహజసిద్ధమైన లోతు ఈ ప్రాజెక్టుకు ప్రధాన అనుకూలతగా మారనుంది. సుమారు 17 మీటర్ల సహజ లోతు ఉండటంతో భారీ నౌకల రాకపోకలకు అవసరమైన డ్రెడ్జింగ్ పనుల అవసరం తగ్గనుంది. పెద్ద సరకు రవాణా నౌకలు, భారీ కంటైనర్ షిప్‌లు నేరుగా బెర్త్‌లకు చేరుకునే అవకాశం ఉండటంతో కాకినాడ క్లస్టర్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడనుంది. ఈ మూడు కేంద్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్ సముద్ర ఆధారిత పరిశ్రమలు, నౌకా నిర్మాణ రంగంలో కీలక కేంద్రంగా ఎదిగే అవకాశాలు ఏర్పడనున్నాయి.

# దసరా భద్రతకు హైటెక్ నిఘా




**విజయవాడ, అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):** ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కనకదుర్గమ్మ దర్శనం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో పోలీసు శాఖ భద్రతా చర్యలను మరింత పటిష్టం చేసింది. భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించడంతో పాటు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఈసారి కృత్రిమ మేధ (ఏఐ)తో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది.

రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అనంతరం నగర పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుతో కలిసి ఇంద్రకీలాద్రిపై భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సంప్రదాయ బందోబస్తుతో పాటు సాంకేతిక నిఘాకు ప్రాధాన్యం ఇచ్చినట్లు డీజీపీ తెలిపారు. ఏఐ ఆధారిత రద్దీ విశ్లేషణ వ్యవస్థ ద్వారా క్యూలైన్లలో భక్తుల కదలికలను నిరంతరం అంచనా వేస్తూ, రద్దీ పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు.

క్యూలైన్లు, ఘాట్ రోడ్లు, పార్కింగ్ ప్రాంతాలపై సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర నిఘా కొనసాగుతోంది. డ్రోన్ల ద్వారా సేకరించే దృశ్యాలను కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థకు అనుసంధానం చేయడంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ఏఎన్‌పీఆర్ కెమెరాలు, బూమ్ బ్యారియర్లను వినియోగిస్తూ, అనుమతించిన వాహనాలను మాత్రమే కొండపైకి అనుమతిస్తున్నారు.

కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాల పరిస్థితిని పోలీసు అధికారులు సమన్వయంతో పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో క్షేత్రస్థాయి సిబ్బందిని తక్షణమే అప్రమత్తం చేసేలా వ్యవస్థను సిద్ధం చేశారు. భక్తులు క్యూలైన్లలో క్రమశిక్షణ పాటిస్తూ పోలీసులకు సహకరించాలని డీజీపీ కోరారు. పిల్లలు, వృద్ధుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమతి లేని మార్గాల్లోకి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఉత్సవాల సమయంలో భక్తులకు సురక్షితమైన, ప్రశాంతమైన దర్శనం కల్పించడమే పోలీసు శాఖ లక్ష్యమని తెలిపారు.

# 7 గంటల పాటు అవినాష్‌రెడ్డిని విచారించిన ఈడీ

- **రూ.40 కోట్ల సుపారీ ఆరోపణలు..**
- **ఆర్థిక లావాదేవీలపై లోతుగా దర్యాప్తు**




**అమరావతి,అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో వైఎస్సార్సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారులు దాదాపు ఏడు గంటలపాటు విచారించారు. విచారణ పూర్తికాకపోవడంతో గురువారం మరోసారి హాజరుకావాలని ఆయనకు అధికారులు సూచించారు.

వివేకానందరెడ్డి హత్యకు రూ. 40 కోట్ల సుపారీ డీల్ జరిగిందన్న సీబీఐ ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఆర్థిక కోణంలో దర్యాప్తు సాగిస్తోంది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద నమోదైన కేసులో హత్యకు ముందు, అనంతరం జరిగిన నగదు లావాదేవీలు, నిధుల బదిలీలు, హవాలా వ్యవహారాలపై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. నిందితులు, వారితో సంబంధం ఉన్న వ్యక్తుల బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, దస్తగిరి, ఉమాశంకర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డికి సంబంధించిన ఆర్థిక వివరాలను ఈడీ సేకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఏ-5 నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారించారు. అలాగే వైఎస్సార్సీపీ నేతల పాత్రపై సునీల్ యాదవ్ గతంలో చేసిన ఆరోపణలపైనా అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

ఆగస్టు 21న అవినాష్‌రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు నిర్వహించిన సోదాల్లో రూ. 24 లక్షల నగదు, లాకర్ తాళం, పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఆ సోదాల్లో లభించిన పత్రాలు, ఇతర నిందితుల నుంచి సేకరించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని అవినాష్‌రెడ్డిని ప్రశ్నించినట్లు సమాచారం. గురువారం జరిగే రెండో దశ విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఎన్నికల కోడ్ నిబంధనలు పక్కాగా పాటించాలి

- **ఉద్యోగులు రాజకీయ తటస్థత పాటించాలి: నగర కమిషనర్ మయూర్ అశోక్**



**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) తక్షణమే అమల్లోకి వచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం నిర్వహించిన ప్రత్యేక టెలికాన్ఫరెన్స్‌లో అధికారులకు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

ఎంసీసీ అమలులో భాగంగా నగరంలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడంతో పాటు పోస్టర్లు, బ్యానర్లు తొలగించే చర్యలు ప్రారంభించినట్లు కమిషనర్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడితే ముందస్తు హెచ్చరికలు లేకుండానే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల విధుల దృష్ట్యా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు మయూర్ అశోక్ తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఆదేశాలను వాట్సాప్ లేదా అధికారిక గ్రూపుల్లో పంపిన వెంటనే సిబ్బంది తమకు కేటాయించిన విధులకు హాజరుకావాలని, సమాచారం అందలేదనే కారణాలు అంగీకరించ బోమని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ తటస్థత పాటించాలని, ఏ అభ్యర్థి లేదా రాజకీయ నాయకుడి ప్రచారంలో పాల్గొనడం, సోషల్ మీడియా వేదికల ద్వారా రాజకీయ మద్దతు ప్రకటించడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఉన్న రాజకీయ పోస్టర్లు, బ్యానర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, కానుకలు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి పనికి నిర్దేశించిన గడువును పాటిస్తూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 100 మీటర్ల లోపల ఎలాంటి ఎన్నికల ప్రచారానికి అవకాశం లేకుండా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల విధులు అత్యంత ప్రాధాన్యమైనవేనని, అదే సమయంలో నగర ప్రజలకు అందాల్సిన రెగ్యులర్ ప్రభుత్వ సేవలు, దైనందిన పరిపాలనా కార్యకలాపాలు ఎక్కడా నిలిచిపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మయూర్ అశోక్ పేర్కొన్నారు.

# ఇంద్రకీలాద్రిపై రాష్ట్రపతి ముర్ము



(మొదటి పేజీ తరువాయి)

అంతకుముందు దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో విజయవాడకు చేరుకున్నారు.

రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భద్రతా ఏర్పాట్లను అధికారులు పటిష్టం చేశారు. దర్శనం సందర్భంగా సుమారు అరగంటపాటు భక్తులకు దర్శనాలు నిలిపివేశారు. రాష్ట్రపతి ఆలయం నుంచి వెళ్లిన వెంటనే సాధారణ భక్తులకు దర్శనాలను పునరుద్ధరించారు.

**సరస్ మేళాకు రాష్ట్రపతి :** విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సరస్ ఆజీవికా మేళాలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేడు ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, లఖ్‌పతి దీదీలతో కలిసి విందులో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం నుంచి దిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు.

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నిమిషాల వారీగా రూపొందించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# సారస్ మేళాకు సర్వం సిద్ధం



(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే డ్వాక్రా మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారి ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలను కల్పించడం సారస్ మేళా ప్రధాన లక్ష్యమని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు పరిచయం చేసుకునే అవకాశం ఈ మేళా ద్వారా లభిస్తుందని చెప్పారు.

జాతీయ స్థాయి కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాన అతిథిగా హాజరుకానుండటం ప్రత్యేకతగా నిలుస్తుందని పెమ్మసాని పేర్కొన్నారు. విజయవాడ, గుంటూరు నగరాలతో పాటు పరిసర ప్రాంతాలు, జిల్లాల ప్రజలు పెద్ద సంఖ్యలో మేళాకు హాజరై వివిధ రాష్ట్రాల రుచులు, ఉత్పత్తులు, హస్తకళలను ఆస్వాదించాలని ఆయన కోరారు.

జాతీయ సారస్ ఆజీవికా మేళాను విజయవాడకు తీసుకురావడానికి ఆసక్తి చూపిన ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్)కు పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు జాతీయ స్థాయి మార్కెట్‌ను పరిచయం చేయడంలో ఈ మేళా కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు

# ఇమామ్‌లు, మౌజన్లకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

మసీదుల్లో రోజువారీ ప్రార్థనా కార్యక్రమాలను నిర్వహించడంలో ఇమామ్‌లు, మౌజన్లు కీలకంగా సేవలందిస్తున్నారు. వారి సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ప్రతి నెలా గౌరవ వేతనాన్ని అందిస్తోంది. ఇమామ్‌లకు నెలకు రూ. 10,000, మౌజన్లకు నెలకు రూ. 5,000 చొప్పున చెల్లిస్తోంది.

తాజాగా విడుదల చేసిన మొత్తంతో కలిపి గత 27 నెలల్లో ఇమామ్‌లు, మౌజన్లకు ప్రభుత్వం మొత్తం రూ. 202 కోట్ల గౌరవ వేతనాన్ని అందించినట్లు వెల్లడించింది. మైనారిటీ వర్గాలకు చెందిన మతపరమైన సేవకుల సంక్షేమంలో భాగంగా ఈ చెల్లింపులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## 19 నుండి 23 వరకు నాగార్జునా విశ్వవిద్యాలయంలో ఎపిఎస్పిఎఫ్ స్పోర్ట్సు మీట్

**అమరావతి, అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఈనెల 19నుండి 23 వరకూ గుంటూరు నాగార్జునా విశ్విద్యాలంయలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్టు విజయవాడ ఎపిఎస్పిఎఫ్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు తెలియజేశారు. 'సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్' తరహాలో 1991 నాటి చట్టం నం. 25 ద్వారా ఏర్పాటైన ఎపిఎస్పిఎఫ్ ఒక సాయుధ దళమని ఇది రాష్ట్ర హోంశాఖ కింద పని చేసే ఒక విభాగమని పేర్కొన్నారు. ఎపి సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు, విమానాశ్రయాలు, తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల, సింహాచలం, అన్నవరం, విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం సహా బ్యాంక్ కరెన్సీ చెస్ట్‌లు, కాకినాడ, రాజమండ్రి ఓఎన్జిసి సంస్థలు, ఎపి జెన్కో కేంద్రాలు, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి ప్రభుత్వ మరియు ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలకు ఎపిఎస్పిఎఫ్ రక్షణ మరియు భద్రతను కల్పిస్తోందని ఆయన పేర్కొన్నారు.

35APSPF ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 19నుండి 23 వరకూ నాగార్జునా విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయి ఎపిఎస్పిఎఫ్ క్రీడా పోటీలు-2026' కు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాలలో పని చేస్తున్న క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, 5 కి.మీ పరుగు, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ వంటి పోటీల్లో పాల్గొనున్నారని కమాండెంట్ శంకరరావు తెలిపారు. 5 రోజులపాటు నిర్వహించనున్నఈ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ప్రారంభ మరియు ముగింపు కార్యక్రమాలకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీశ్ కుమార్ గుప్త సహా ఇతర పోలీస్ ఉన్నతాధికారులు, పలువురు ప్రముఖులను కూడా ఆహ్వానిస్తున్నట్టు కమాండెంట్ శంకర్ రావు తెలియజేశారు.

# ఎంపీటీసీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులు

**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** ఎంపీటీసీ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అథారిటీ సీఎం సాయికాంత్ వర్మ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆర్వోలు ఏఆర్వోల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

గుంటూరు రూరల్ కు జిల్లా సహకార అధికారి ఇ.రత్నావతి రిటర్నింగ్ అధికారిగా, ఎంపీడీవో ఐ. సావిత్రి , తాసిల్దార్ పీఏ కిరణ్ కుమార్ సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు.

మేడికొండూరు మండలానికి జిల్లా వ్యవసాయ అధికారి ఎం పద్మావతి రిటర్నింగ్ అధికారిగా, ఎంపీడీవో కే డేవిడ్ ప్రభాకర్, తాసిల్దార్ జి రాఘవరావు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

పెదకాకాని మండలానికి జిల్లా అటవీ అధికారి ఎం హిమ శైలజ ఆర్వోగా, ఎంపీడీవో రమావత్ శ్రీనివాసరావు, తాసిల్దార్ పీ కృష్ణకాంత్ ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

పెదనందిపాడు మండలానికి ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి పి జి ప్రసూన ఆర్ఓగా, ఎంపీడీవో జీ లక్ష్మీదేవి, తాసిల్దార్ కే కళ్యాణి ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

ఫిరంగిపురం మండలానికి జిల్లా బీసీ సంక్షేమ అధికారి కే మయూరి ఆర్వోగా, ఎంపీడీవో పి శివ సుబ్రహ్మణ్యం, తాసిల్దార్ జే ప్రసాదరావు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

ప్రత్తిపాడు మండలానికి గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్ ఆర్ వో గా, ఎంపీడీవో కే శివ పార్వతి, తాసిల్దార్ కే వెంకటేశ్వరరావు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

వట్టిచెరుకూరు మండలానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి శంకర్ ఆర్ వో గా, ఎంపీడీవో ఏ అలీషా బాబు, తాసిల్దార్ కే రాజీవ్ కుమార్ ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

చేబ్రోలు మండలానికి జిల్లా సరఫరా అధికారి పి కోమలి పద్మ ఆర్ వో గా, ఎంపీడీవో టీ ఉషారాణి, తాసిల్దార్ కే శ్రీనివాసరావు ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

దుగ్గిరాల మండలానికి ఏపీ మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ టి నరసింహారెడ్డి ఆర్వోగా, ఎంపీడీవో ఆదిగోప్పుల శ్రీనివాసరావు, తాసిల్దార్ ఐ సునీత వ్యవహరిస్తారు.

కాకుమాను మండలానికి భూగర్భ జల ఉపసంచాలకులు బి వందనం ఆర్వోగా, ఎంపీడీవో జి వీరస్వామి, తాసిల్దార్ బి వెంకటస్వామి ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

కొల్లిపర మండలానికి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం. క్రిష్టి అభినవ్ ఆర్వోగా, ఎంపీడీవో బి విజయలక్ష్మి, తాసిల్దార్ జి సిద్ధార్థ ఏ ఆర్ ఓ లుగా వ్యవహరిస్తారు.

పొన్నూరు మండలానికి డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి విజయలక్ష్మి ఆర్వోగా, ఎంపీడీవో జి చంద్రశేఖర్, తాసిల్దార్ జియా ఉల్ హక్ ఏ ఆర్ ఓ లుగా వ్యవహరిస్తారు.

తెనాలి మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డి దుర్గాభాయి ఆర్వోగా, ఎంపీడీవో ఏ దీప్తి, తాసిల్దార్ కె వి గోపాలకృష్ణ ఏఆర్వోలుగా వ్యవహరిస్తారు.

# అవినీతికి పాల్పడిన శంకర్ బాలాజీని తక్షణమే సస్పెండ్ చేయాలి



- **శంకర్ బాలాజీ కి ఒక న్యాయం ఈవో జగన్మోహన్ రెడ్డికి మరో న్యాయమా**
- **దేవాలయాల సంరక్షణ సమితి అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి**

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారిగా శంకర్ బాలాజీని తక్షణమే సస్పెండ్ చేయాలని దేవాలయాల సంరక్షణ సమితి అధ్యక్షులు పుప్పాల శ్రీనాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈవో జగన్మోహన్ రెడ్డికి ఒక న్యాయం ఏసీ శంకర్ బాలాజీకి మరో న్యాయమా అని ఆయన అన్నారు. బుధవారం నాడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కమలాపురం మండలం మీనాపురం గ్రామ సమీపంలో ఉన్న శివాలయంలో ఈవోగా పనిచేస్తున్న జగన్మోహన్ రెడ్డి శివాలయం భూముల ద్వారా వచ్చిన ఆదాయాన్ని డిపాజిట్ చేయకుండా నగదు రూపంలో పూజారికి జీతభత్యాలు ఇవ్వడం ఆలయ చైర్మన్ ఫిర్యాదు మేరకు విచారణ చేయకుండా సస్పెండ్ చేసిన అధికారులు ప్రొద్దుటూరు పట్టణంలోని అగస్తేశ్వర స్వామి ఆలయంలో బంగారు నగలు ఇతరత్రా రూపాలలో దాదాపు 62 లక్షల రూపాయల అవినీతి కి పాల్పడినట్లు జ్యువలరీ మరియు దేవాదాయ శాఖ అధికారులు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసిన అతనిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి అధికారులను ప్రోత్సహిస్తూ నీతివంతమైన అధికారుల చర్యలు తీసుకోవడం దేవదాయా శాఖ అధికారులకు ఎంతవరకు సమంజసం ఉన్నారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పిట్ పర్సన్ గా పనిచేసిన కాలంలో అవినీతి అక్రమాలపై స్వయంగా మంత్రిగారికి విన్నవించగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని జగన్మాత ఈశ్వరి దేవి మఠం కారా నిర్వహణ అధికారిగా ఏ విధంగా నియమిస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బ్రహ్మంగారి మఠం మండల బిజెపి అధ్యక్షులు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి, బిజెపి ఓబిసి మోర్చా అధ్యక్షులు సారె రామానాయుడు, బిజెపి ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి చంద్రకాంతం ఈశ్వరయ్య పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డికి దసరా ఆహ్వాన పత్రిక అందజేత



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి కి ఆర్యవైశ్య సభ అధ్యక్షులు బ్రహ్మంగారిమఠం అయ్యపు సురేష్ బాబు సూచనలతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరుగు దసరా శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికను ప్రొద్దుటూరులోని తన నివాసంలో కలిసి అందజేసిన బ్రహ్మంగారిమఠం ఆర్యవైశ్య సభ కమిటీ సభ్యులు. ఈ సందర్భంగా సెక్రటరీ సుంకు సురేష్ బాబు మాట్లాడుతూ వాసవి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు ప్రాత్రులగుదురు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు అమరావతి బ్రహ్మం యువజన సంఘం అధ్యక్షుడు యాదాళ్ళ వెంకటసుబ్బయ్య ఎగ్జిక్యూటివ్ మెంబెర్ పత్తి సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రకటన విడుదల.... నియమావళి పక్కాగా అమలు చేయాలి



**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటనను రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. ఎన్నిల ఎన్నికల ప్రకటన విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తన నియమావళి తక్షణం అమలులోకి వచ్చిందని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జిల్లా అధికారులు, స్థానిక సంస్థల అధికారులు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన మేరకు నగర పాలక సంస్థలు, పురపాలక సంస్థలు, ఎంపీటీసీ – జడ్పిటిసి, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థకు, తెనాలి పురపాలక సంస్థకు జిల్లాలో ఎన్నికలు జరగనున్నాయని అన్నారు. అక్టోబర్ 16వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి, అదే రోజు నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. నామినేషన్లను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని అన్నారు. అక్టోబర్ 18వ తేదీన నామినేషన్ల దాఖలు చేయుటకు చివరి తేదీ అని తెలిపారు. 19వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, 21వ తేదీన అభ్యర్థిత్వం ఉపసంహరణకు ఆఖరు తేదీ అని వివరించారు. 21వ తేదీన పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రకటన చేయడం జరుగుతుందని చెప్పారు. 28వ తేదీన ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 30వ తేదీన ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటల నుండి ప్రారంభమవుతుందని అన్నారు. ఎంపీటీసీ జడ్పిటిసి లకు నోటిఫికేషన్ విడుదల అనంతరం నవంబర్ మూడవ తేదీన పోలింగ్ జరుగుతుందని, ఐదవ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందని చెప్పారు.

గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు గఫంలో దశలలో జరుగుతుందని, డిసెంబర్ రెండవ తేదీ నాటికి చివరి దశ పూర్తి అవుతుందని వివరించారు. జిల్లాలో మొత్తం 207 గ్రామ పంచాయతీ లకు ఎన్నికలు జరుగుతాయని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని స్పష్టం చేశారు. స్టాటిక్ టీమ్ లు, సర్వేలియన్స్ టీములు, ఫ్లయింగ్ స్క్వాడ్ ల నియామకం జరిగిందని అన్నారు. ఎన్నికల నియమావళిని అందరి అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ఎక్కడ లోపాలు ఉండరాదని స్పష్టం చేశారు. 50వేలకు పైగా నగదు తీసుకు వెళ్ళుటకు అవకాశం లేదని, పెద్ద స్థాయిలో కానుకలు, మద్యం సరఫరా, రవాణా జరగరాదని సూచించారు. మద్యం విక్రయాలపై ప్రతిరోజు స్థానిక రెవెన్యు డివిజనల్ అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు, కంట్రోల్ రూమ్ కు నివేదికలు సమర్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మద్యం విక్రయాలపై పూర్తిస్థాయి నిఘా ఉండాలని చెప్పారు.

**గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం**

గురువారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారిమఠంలో వాసవి మాతను దర్శించుకున్న

# కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం కమిటీ

- **జిల్లా కమిటీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన వేద పండితులు, కమిటీ సభ్యులు**



**బ్రహ్మంగారిమఠం, (జర్నలిస్ట్ ఫైల్):** దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని, బ్రహ్మంగారిమఠంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ మరియు జిల్లా కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా విచ్చేసిన జిల్లా కమిటీకి ఆలయ వేద పండితులు, స్థానిక ఆర్యవైశ్య సంఘం కమిటీ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్‌బాబు, సెక్రటరీ సుంకు సురేష్‌బాబు, ఉపాధ్యక్షులు సుంకు సిద్దయ్య మరియు యువజన సంఘం అధ్యక్షులు యాదాల మహిళా మండలి అధ్యక్షురాలు ముచ్చర్ల పద్మజ మరియు కమిటీ సభ్యులు పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలు, ప్రత్యేక బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు.

అనంతరం అమ్మవారి సన్నిధిలో జిల్లా కమిటీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు అర్చక బృందంతో వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి శాలతో ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు తులసి నాగరాజా, వైస్ చైర్మన్ కొలిశెట్టి వెంకటసుబ్బయ్య, ఉద్యోగుల సంఘం కమిటీ వైస్ చైర్మన్ పబ్బతి చక్రపాణి, జాయింట్ సెక్రటరీ మల్లెముల నారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బచ్చు వెంకట సుధాకర్, స్టేట్ యువజన సంఘం సెక్రటరీ గాజులపల్లి లక్ష్మీనరసింహ, మహిళా మండలి ట్రెజరర్ దేవతి లలిత, గౌరవ సలహాదారులు వల్లంకొండు ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీ పబ్బతి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక అభినందనలు:** అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జిల్లా కమిటీకి స్థానిక ఆలయ కమిటీ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్‌బాబు మరియు సభ్యులు అందించిన ఆత్మీయ ఆతిథ్యం, ఘన స్వాగత మర్యాదల పట్ల జిల్లా అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

?అనంతరం జిల్లా అధ్యక్షులు మరియు కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వాసవి మాత ఆశీస్సులు ఉమ్మడి కడప జిల్లా ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

# రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్..



**న్యూఢిల్లీ :** రైల్వే ఉద్యోగులకు దీపావళి కానుకగా 78 రోజుల వేతనానికి సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్ (పిఎల్‌బి) చెల్లించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో దేశవ్యాప్తంగా 11,40,770 మంది నాన్ గెజిటెడ్ రైల్వే ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. బోనస్ చెల్లింపుల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.2,009.61 కోట్లను కేటాయించింది. అర్హులైన ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 బోనస్ అందనుంది. ట్రాక్ నిర్వహణ సిబ్బంది, లోకో పైలట్లు, రైలు మేనేజర్లు (గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, సాంకేతిక సిబ్బంది, టెక్నీషియన్ సహాయకులు, పాయింట్స్‌మెన్, మంత్రిత్వ శాఖకు సంబంధించిన ఉద్యోగులు, ఇతర గ్రూప్-సి సిబ్బంది ఈ బోనస్‌కు అర్హులు. బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు ఐడిబిఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి అనుగుణంగా, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్‌లోని మొత్తం ఈక్విటీ వాటాలో 60.72 శాతం భాగాన్ని విక్రయించాలని నిర్ణయించింది. మొత్తం రూ.52,878 కోట్ల ఫెయిర్‌ఫాక్స్ సంస్థకు విక్రయించాలని ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

'జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం'ను 2026-27 నుంచి 2030-31 వరకు కొనసాగించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ అయిదేళ్ల కాలానికి గానూ రూ. 53,428 కోట్ల మొత్తం వ్యయంతో ఈ పథకాన్ని కొనసాగిస్తారు. ఈ పథకం, దాని అనుబంధ పథకాల పేర్లను మార్చడం, దివ్యాంగుల పెన్షనుకు సంబంధించి అర్హత ప్రమాణాలు, లబ్ధిదారుల పరిధి, అందించే సహాయం మొత్తాన్ని సవరించడం, వృద్ధులు, వితంతువుల పెన్షన్ పథకాలతో పాటు కుటుంబ ప్రయోజన పథకాన్నీ ప్రస్తుతం ఉన్న రూపంలోనే కొనసాగించడం వంటివి ఉన్నాయి.

# ఎన్నికల కమిషన్‌పై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ:** కర్ణాటకలోని శృంగేరి అసెంబ్లీ నియోజకవర్గంలో 2023 నాటి ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగ్ కనిపించడం లేదన్న భారత ఎన్నికల కమిషన్ (ఇసి)ను సుప్రీం కోర్టు బుధవారం మందలించింది. ఈ వాదనపై జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్‌లతో కూడిన ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. "మా రికార్డులు పోయాయని ఎన్నికల కమిషన్ ఎలా చెప్పగలదు? ఎన్నిక నిర్వహించడమే మీ ప్రధాన విధి. అటువంటప్పుడు సంబంధిత డాక్యుమెంట్ మీ వద్ద ఉండాల్సిన అవసరం ఉంది కదా? ఆ వీడియో కోసం వెతుకుతున్నామని ఎలా చెబుతారు? ఎన్నికైన అభ్యర్థికి మీరు దాన్ని అందజేసేశారు. రికార్డుల భద్రత, సంరక్షణ మీ వద్ద లేదు. మీ దగ్గర ఏమున్నా తదుపరి విచారణ తేదీ నాటికి కోర్టుకు అందజేయాలి, లేనిపక్షంలో మీపై ప్రతికూల నిర్ణయానికి రావాల్సి ఉంటుంది. ఇటువంటి కుంటి సాకులు ఆమోదించేది లేదు, తక్షణమే దాన్ని ప్రవేశపెట్టాల్సిందే" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

2023 ఎన్నికల్లో కేవలం 201 ఓట్ల తేడాతో శృంగేరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి టిడి రాజగౌడ గెలిచారు. ఆయనకూ, బిజెపి అభ్యర్థి డిఎన్ జీవరాజ్‌కూ మధ్య నెలకొన్న ఎన్నికల వివాదంపై కోర్టు విచారణ జరుపుతోంది. రాజెగౌడ దాఖలు చేసిన పిటిషన్ పరిష్కారమయ్యే వరకు ఆయన ఎంఎల్ఎగా కొనసాగవచ్చని సుప్రీం మే నెలలో ఆదేశించింది. అయితే రీకౌంటింగ్‌లో జీవరాజ్‌కు ఎక్కువ ఓట్లు వచ్చినట్టు ప్రకటించడంతో రాజగౌడ ఇటీవల ఆ సీటును ఖాళీ చేశారు.

ఎన్నికల పరిశీలకుడి నివేదిక, అసలు ఓట్ల లెక్కింపు, ఇటీవలి రీకౌంటింగ్‌కు సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను రాజగౌడ చూడాలనుకుంటున్నారని కోర్టు పేర్కొంది. ఈ పత్రాలు, వీడియోలను తమ ముందు ప్రవేశపెట్టాలని ఇసిని ఆదేశిస్తామని తెలిపింది. ఇసి తరఫు సీనియర్ న్యాయవాది శేషాద్రి నాయుడు స్పందిస్తూ, ఆ వీడియో ఇసి వద్ద లేదని చెప్పారు. కోర్టు ఈ వాదనతో ఏకీభవించలేదు. ఇసి వద్ద ఏ పత్రాలు ఉన్నా వాటిని సమర్పించాల్సిందేనని స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 15కి వాయిదా వేసింది.

# నెట్‌ఫ్లిక్స్‌లో భారీ లేఆఫ్స్..

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీగా ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. సుమారు 1,000 మంది ఉద్యోగాలకు కోత పెట్టాలని నిర్ణయించింది. 2022 తర్వాత సంస్థ చేపడుతున్న అతిపెద్ద తొలగింపులు ఇవే. కంపెనీ వృద్ధి వేగం తగ్గడం, ప్రేక్షకుల కోసం ఇతర స్ట్రీమింగ్ సంస్థల నుంచి పోటీ పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం వెల్లడించింది.

ఈ తొలగింపులతో నెట్‌ఫ్లిక్స్ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు ఆరు శాతం మంది ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ప్రొడక్ట్, టెక్నాలజీ, న్యాయ, మానవ వనరుల విభాగాల్లో ఎక్కువ కోతలు ఉండనున్నట్లు సమాచారం. సంస్థ సహ-సీఈవోలు టెడ్ సరాండోస్, గ్రెగ్ పీటర్స్ బుధవారం ఉద్యోగులకు ఈ నిర్ణయాన్ని ఈమెయిల్ ద్వారా తెలియజేశారు.

సబ్‌స్క్రిప్షన్ల ద్వారా వచ్చే ఆదాయానికే పరిమితం కాకుండా ప్రకటనలు, లైవ్ కార్యక్రమాలు, గేమింగ్ రంగాల్లోకి విస్తరించాలని నెట్‌ఫ్లిక్స్ ప్రయత్నిస్తోంది. అయితే ఆశించిన స్థాయిలో వృద్ధి సాధించలేకపోతున్నట్లు సంస్థ యాజమాన్యం అంగీకరించింది.

సెప్టెంబర్ చివర్లో బ్లూమ్‌బెర్గ్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన టెడ్ సరాండోస్.. కంపెనీ వృద్ధి తాను కోరుకున్నంత వేగంగా లేదని వ్యాఖ్యానించారు.

## 'గంగానమ్మ' ఆధ్యాత్మిక గీతాన్ని విడుదల



**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్)** :'గంగానమ్మ పిక్చర్స్' ప్రొడక్షన్ బ్యానర్‌పై మోటేపల్లి సత్యవతి, చాయా దేవి సంయుక్తంగా నిర్మించిన 'గంగానమ్మ' ఆధ్యాత్మిక ప్రత్యేక గీతాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ బుధవారం రాజమహేంద్రవరంలోని తమ క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్, దెందులూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఘంటసాల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో చిత్ర బృందం మంత్రి దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఈ పాటను ప్రదర్శించారు. పాటను తిలకించి, ఆలకించిన అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక భావనలను పెంపొందించేలా, అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పాటను తెరకెక్కించినందుకు చిత్ర యూనిట్‌ను అభినందించారు. సాంస్కృతిక విశిష్టతను చాటేలా రూపొందిన ఈ గీతం వినసొంపుగా ఉందన్నారు. భవిష్యత్తులో ఈ బృందం ఇలాంటి మరెన్నో మంచి భక్తిపాటలను సమాజానికి అందించాలని ఆకాంక్షించారు.

మంత్రి దుర్గేష్ ను కలిసిన వారిలో నిర్మాతలు మోటేపల్లి సత్యవతి, చాయా దేవి, దర్శకుడు సాయి తేజ, సంగీత దర్శకుడు సత్య కశ్యప్, కొరియోగ్రాఫర్ సాగర్ వేలూరు, చీఫ్ అసోసియేట్ ఎడిటర్ నాగేంద్రలతో పాటు గంగానమ్మ పాత్రధారి శ్రియా బెండాడి, చైల్డ్ ఆర్టిస్ట్ దేవాన్షి, నటీనటులు వంశీ మోటేపల్లి, కల్యాణ్ నాయుడు, నవ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 1 నుంచి 24 వరకూ సూర్యలంకలో భారత వైమానిక దళం శిక్షణ

- **ఆసమయంలో సూర్యలంక బీచ్ ప్రవేశాలను నిషేధం**

**అమరావతి,అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):**బాపట్ల జిల్లా సూర్యలంక వైమానిక దళ కేంద్రంలో భారత వైమానిక దళానికి చెందిన ఎస్ఏజీడబ్ల్యూ యూనిట్ల నిర్వహణ శిక్షణా కార్యక్రమాన్ని డిసెంబర్ 1 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీవార్డ్ ఆర్టిలరీ ప్రాక్టీస్ చట్టం, 1949లోని సెక్షన్ 3ఏ కింద రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ శిక్షణా కార్యక్రమం డిసెంబర్ నెలలో రెండు దశల్లో జరగనుంది. మొదటి దశ డిసెంబర్ 1 నుంచి 11వ తేదీ వరకు,రెండో దశ డిసెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ రెండు దశల్లోనూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కార్యకలాపాలు కొనసాగుతాయి. శిక్షణా కార్యక్రమం నేపథ్యంలో సూర్యలంక వైమానిక దళ కేంద్రానికి ఆనుకుని ఉన్న బాపట్ల మండల పరిధిలోని సముద్ర తీర ప్రాంతాన్ని నిర్దేశిత సమయాల్లో ప్రమాదకర ప్రాంతంగా ప్రకటించారు. శిక్షణా కాలంలో నిర్దేశిత ప్రాంతంలోకి ప్రజలు వెళ్లకుండా అవసరమైన హెచ్చరికలు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. శిక్షణలో భాగంగా బాపట్ల మండల పరిధిలోని 15ళీ50'34" ఉత్తర అక్షాంశం, 080ళీ29'24" తూర్పు రేఖాంశాల వద్ద ఉన్న ఫైరింగ్ పాయింట్ల నుంచి 110 డిగ్రీల రేడియల్ పరిధిలో సముద్రంలోకి 100 కిలోమీటర్ల దూరం వరకు,అలాగే 200 డిగ్రీల రేడియల్ పరిధిలో భూమట్టం నుంచి అపరిమిత ఎత్తు వరకు ఉన్న ప్రాంతాలను సురక్షితం కాని ప్రాంతాలుగా గుర్తించారు. ఫైరింగ్ పాయింట్లకు సమీపంలోని ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లో ఫైరింగ్ కార్యకలాపాలు జరిగే సమయంలో ప్రజలు భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని,సంబంధిత అధికారుల ఆదేశాలకు సహకరించాలని ప్రభుత్వం సూచించింది.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):**ప్రొద్దుటూరులోని మైదుకూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైదుకూరు నియోజకవర్గానికి చెందిన 85 మంది లబ్ధిదారులకు మొత్తం 1,10,52,317 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పంపిణీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోంది. అర్హులైన బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్య అవసరాలకు ఆర్థిక ఇబ్బందుల సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

# జనగణన విధుల్లో నిర్లక్ష్యం వద్దు

-జనగణన విధులపై సిబ్బందికి అవగాహన తప్పనిసరి.

: జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి




**వికారాబాద్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** జనగణన--2027 ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటాచారి అధికారులకు సూచించారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన--2027 రెండో దశకు సంబంధించి ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకటాచారి మాట్లాడుతూ, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసే జనగణన వంటి కీలక ప్రక్రియలో భాగస్వాములై పనిచేసే అవకాశాన్ని అదృష్టంగా భావించాలని అన్నారు. జనగణన విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జనగణనలో సేకరించే వివరాలు కచ్చితంగా ఉండేలా చూడటంతో పాటు, ప్రతి అంశంపై అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణ సమయంలో ఎదురయ్యే సమస్యలను ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జనగణన విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనగణన ప్రక్రియలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు, విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకునేందుకు శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో జనగణన మొదటి దశలో భాగంగా ఇంటి జాబితా తయారీ ప్రక్రియ కోసం 2,028 హౌస్ లిస్టింగ్ బ్లాకులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో 1,600 మంది ఎన్యూమరేటర్లు, 271 మంది సూపర్వైజర్లు విధులు నిర్వహించినట్లు వివరించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా జనగణన రెండో దశకు సంబంధించిన విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, డిజిటల్ పద్ధతిలో సమాచార సేకరణ, సాంకేతిక పరికరాల వినియోగం, డేటా నమోదు, సమాచార గోప్యత వంటి కీలక అంశాలపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. జనగణన సందర్భంగా ప్రజల నుంచి సేకరించే సమాచారాన్ని కచ్చితంగా నమోదు చేయడంతో పాటు, సమాచార గోప్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని శిక్షణలో వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, ప్రణాళిక శాఖ రిటైర్డ్ డైరెక్టర్ దయానంద్, ఏడీ రవిచంద్ర, శిక్షణాధికారి జంగయ్యతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

- ఆలయ ధర్మకర్త, మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని ఆలయ ధర్మకర్త,మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళ వారం బాచుపల్లి కౌసల్య కాలనీలో గల శ్రీ వెంకట శివ రామాలయం లోని దుర్గమ్మ అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సంద ర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశా రు. ఈ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త,మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిం చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దుర్గమ్మ దేవాలయంలో పాశుపత చండీ హోమం



**కుత్బుల్లాపూర్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** నిజాంపేట్ శ్రీ కనక దుర్గమ్మ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో 3వరోజు పాశుపత చండీ హోమాన్ని నిర్వహించారు.గౌరీ నోమును నిర్వహించి మహిళలకు గాజులను పంపి ణీ చేశారు. అనంతరం అన్న ప్రసాదన్న వితరణ అమ్మవారి పల్లకి సేవ లు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హనుమంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు




**కుత్బుల్లాపూర్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సుభాష్ నగర్ డివిజన్ కు చెందిన పలువురు మంగళవారం బాచుపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు ద్వారంపూడి నాగిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ మైనార్టీ చైర్మన్ అబ్దుల్ గఫ్ఫార్, వైస్ చైర్మన్ పాషా, డివిజన్ మైనార్టీ అధ్యక్షుడు ఎండి యాసీన్,ఎండి జబ్బార్,షేక్ ఇర్ఫాన్,రవి,రాజు,కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క చొరవతో ఎఫ్‌టీఈల చిరకాల డిమాండ్‌కు పరిష్కారం

- 20 ఏళ్ల పోరాటానికి ఫలితం 3,800 మంది ఉద్యోగులకు ఆర్థిక భరోసా.
- ఉపాధి హామీ పథకం ఎఫ్‌టీఈ ఉద్యోగులకు దసరా కానుక.
- 3,800 మంది ఉద్యోగులకు గ్రాట్యుటీతో ఆర్థిక భరోసా జీవో జారీ.
- సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఎఫ్‌టీఈల కృతజ్ఞతలు.



**వికారాబాద్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం దసరా కానుక అందించింది. దాదాపు 20 ఏళ్లుగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న గ్రాట్యుటీ డిమాండ్‌కు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,800 మంది ఉద్యోగులకు ఆర్థిక భరోసా లభించనుంది. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మంత్రి సీతక్క చొరవ తీసుకోవడంతోనే ఈ నిర్ణయం సాధ్యమైందని ఉద్యోగ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. రిటైర్మెంట్ సమయంలో ఉద్యోగులకు కనీసం రూ.4 లక్షల గ్రాట్యుటీ లభించనుండగా, పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల కు కనీసం రూ.10 లక్షల వరకు ప్రయోజనం కలిగే అవకా శం ఉందని వెల్లడించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ సమస్యను పరిష్కరించినందుకు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కతో పాటు తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు ఉద్యోగుల సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమ మే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతు న్నామని తెలిపారు. కష్టపడి పనిచేసిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ఆర్థిక ఇబ్బం దులు ఎదుర్కోకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని, జీవిత చరమాంకంలో వారికి ఆర్థిక భద్రత కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయం తమ 20 ఏళ్ల పోరాటానికి ఫలితమని ఎఫ్‌టీఈ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. తమ డిమాండ్‌ను నెరవేర్చడంలో చొరవ చూపిన మంత్రి సీతక్కకు, సహకరించిన ప్రభుత్వ పెద్దలకు మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

- గడువులోగా ప్రజా ఫిర్యాదులు, ఆస్తి పన్ను సేవలు పూర్తి చేయాలి



**శేర్లింగంపల్లి, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మియాపూర్ సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్క రించాలని సంబంధిత అధికారు లకు డిప్యూటీ కమిషనర్ ఆదేశించారు. మంగళవారం మియాపూర్ సర్కిల్-48 కార్యాలయంలో వివిధ అంశాలపై సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్షపు నీటి నిల్వ కేంద్రాలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ బడ్జెట్లు, చెత్త పేరుకుపోయే ప్రాంతాల తొలగింపు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సర్వే నంబర్లు, పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను సేవలు, నిర్ణీత గడువు దాటిన ప్రజా ఫిర్యాదులపై సమీక్షించారు. ఆయా విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ప్రజలకు అందించాల్సిన సేవల్లో జాప్యం జరగకుండా చూడాలని, గడువు దాటిన ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పెండింగ్ సమస్యలను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## ఆటో కార్మికుల సంక్షేమం కోసం తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుంది

- రామన్న గారి రాఘవేంద్ర గౌడ్



**మేడ్చల్ అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడ్చల్ 297 డివిజన్ పరిధిలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్లమ్మ మరియు కట్ట మైసమ్మ దేవతల పూజా కార్యక్రమానికి ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్న గారి రాఘవేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రాఘవేందర్ గౌడ్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థప్రసాదాలు స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సంక్షేమం కోసం తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు.కష్టపడి పనిచేసే ఆటో డ్రైవర్ల కుటుంబాలపై ఆ భగవంతుని ఆశీస్సులు,కట్ట మైసమ్మ,ఎల్లమ్మ తల్లీ దీవెనలు ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.సమాజంలో రవాణా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని స్పష్టం చేశారు.ఈ పూజా కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రతినిధులు,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు, భక్తులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలి

- గాంధీ పార్క్ వాలీబాల్ కోర్టును పరిశీలించిన మాజీ కార్పొరేటర్ శ్రవణ్



**మల్కాజిగిరి అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు, క్రీడా మైదానాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. ఓల్డ్ మల్కాజిగిరి చౌరస్తాలోని గాంధీ పార్క్ వాలీ బాల్ కోర్టును ఆయన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. గతంలో తన ప్రత్యేక నిధులతో నిర్మించిన వాలీబాల్ కోర్టులో ఇంకా కొన్ని సదుపాయాలు కల్పిం చాల్సి ఉందని అధికారులకు వివరించారు.క్రీడాకారులు రాత్రి వేళల్లోనూ ఆటలు ఆడేందుకు వీలు గా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని, వాలీబాల్ బయటకు వెళ్లకుండా కోర్టు చుట్టూ ఫెన్సింగ్ నిర్మిం చాలని సూచించారు. మహిళా క్రీడాకారిణుల సౌకర్యార్థం ప్రత్యేక చేంజింగ్ రూమ్ ఏర్పాటు చేయా ల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ అంశాలపై స్పందించిన ఎస్ఈ లక్ష్మణ్ సంబంధిత అధికారు లకు అవసరమైన పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ దివ్యజ్యోతి, ఏఈ కవిత, విజయ్ కుమార్, నర్సింహా, అంజి, రాజు, సునీల్ యాదవ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి ఆరేలియా కుటుంబానికి అండగా ఉంటాం

: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజిగిరి, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్‌లో హత్యకు గురైన ఐదేళ్ల చిన్నారి ఆరేలియా అలియాస్ మోను కుటుంబ సభ్యులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పరామర్శించారు. చిన్నారి మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుం బానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద ఘటనతో తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యుల ను ఓదార్చిన ఎమ్మెల్యే, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చిన్నారి కుటుం బానికి న్యాయం జరగాలని ఆకాంక్షిం చారు.20 లక్షల కోసం చిన్నారిని కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జేపీసీ వెంకన్న, మేకల రాము యాదవ్, లక్ష్మణ్ యాదవ్, అల్లి శ్రీనివాస్, లియోనార్డ్, వెంకటేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, సురేష్, తిరుపతిరావు, శ్రీనివాస్, శోభ, రమేష్, విజయ్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, సందీప్ రెడ్డి, హను మాన్ చారి, గౌస్ ఇమ్రాన్, వినీత్ తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

## రావిచేడులో పారిశుధ్య కార్మికులకు దసరా కానుక!

- గ్రామ పరిశుభ్రతలో కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- సర్పంచ్ బొప్పిడి గోపాల్



**కడ్తాల్ అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామాన్ని పరిశుభ్రంగా,ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమని జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు,రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ అన్నారు.దసరా పండుగను పురస్కరించుకుని మంగళవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఆయన తన సొంత నిధులతో నూతన దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బొప్పిడి గోపాల్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.ఎండనకా,వాననకా విధులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అంకితభావంతో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.వారి కృషి వల్లే గ్రామంలో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా కొనసాగుతోందని అన్నారు.పండుగ వేళ పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు.గ్రామాభివృద్ధిలో భాగస్వాములవుతున్న కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.వారి సేవలను గుర్తించి గౌరవించడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య,వార్డు సభ్యులు మంజుల,శోభ,బొగురమ్మ,నాయకులు రమేష్, శ్రీనివాస్,కర్నాజి, సాయికుమార్,గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ్ మార్నింగ్ పేరుతో భారీ మోసాలు

- సైబర్ నేరగాళ్ల ఆట కట్టించేందుకు వికారాబాద్ పోలీసుల దర్యాప్తు.




**వికారాబాద్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** సోషల్ మీడియా వేదికగా ఆన్‌లైన్ గేమింగ్, పెట్టుబడుల పేరుతో ప్రజలకు అధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపించి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, సూచించారు. ఫేస్‌బుక్‌లో కళ్యాణ్ మార్నింగ్ ,మిలన్ మార్నింగ్ ,శ్రీదేవి, పేర్లతో నకిలీ విజేతల వీడియోలు, మనీ వోచర్లు ప్రచారం చేస్తూ అమాయకులను మోసం చేస్తున్నారని హెచ్చరించారు. కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని గట్టనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ తరహా సైబర్ మోసానికి గురైన ఘటనపై క్రైమ్ నంబర్ 35/2026గా కేసు నమోదైంది. బాధితుడు ఫేస్‌బుక్‌లో 'కళ్యాణ్ మార్నింగ్,'పేరుతో ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ ప్రకటనను చూసి అందులో ఇచ్చిన మొబైల్ నంబర్ ద్వారా సంబంధిత వ్యక్తులను సంప్రదించాడు. పెట్టుబడి పెడితే అధిక ఆదాయం వస్తుందని నమ్మించిన నిందితులు తొలుత ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని కోరడంతో బాధితుడు డబ్బులు బదిలీ చేశాడు. అనంతరం కళ్యాణ్ మార్నింగ్,మిలన్ మార్నింగ్,శ్రీదేవి,పేర్లతో గెలుపొందినట్లు చూపించే నకిలీ మనీ వోచర్లను పంపించి, బాధితుడు సుమారు రూ.2,65,000 గెలుచుకున్నట్లు నమ్మించారు. ఆ మొత్తాన్ని విడుదల చేయాలంటే సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ, ఇతర పన్నులు చెల్లించాలని చెప్పి విడతలవారీగా డబ్బులు వసూలు చేశారు. ఈ విధంగా బాధితుడి నుంచి పలు ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా మొత్తం రూ.1,58,300 బదిలీ చేయించుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930ను సంప్రదించి, అనంతరం కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మార్చి 3న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సోషల్ మీడియా, గేమింగ్ అప్లికేషన్ల ద్వారా ఆకర్షణీయమైన ప్రకటనలు, నకిలీ విజేతల వీడియోలు, డబ్బులు గెలుచుకున్నట్లు చూపించే వోచర్లు ప్రచారం చేసి ప్రజలను వలలో వేసుకుంటున్నట్లు గుర్తించారు. బాధితుల నుంచి ప్రాసెసింగ్ ఫీజు, సర్వీస్ ఛార్జీలు, జీఎస్టీ తదితర పేర్లతో డబ్బులు వసూలు చేసి, వాటిని వివిధ బ్యాంకు ఖాతాలు, ఆన్‌లైన్ పేమెంట్ స్కానర్ల ద్వారా బదిలీ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ తన సిబ్బందితో కలిసి కామారెడ్డి పట్టణ బస్‌స్టాండ్ ప్రాంతంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి తెల్లరంగు మారుతి సుజుకి స్విఫ్ట్ డిజైర్ కారు, పలు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గతంలోనూ కొందరు నిందితులను అరెస్ట్ చేయగా, మిగిలిన నిందితుల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్ నేతృత్వంలోని బృందం సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ సమాచారాన్ని విశ్లేషిస్తూ కేసును దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో పెట్టే పెట్టుబడి ప్రకటనలు, నకిలీ విజేతల వీడియోలు, బహుమతులు పొందేందుకు ముందుగా డబ్బులు చెల్లించాలనే సందేశాలను నమ్మవద్దని సూచించారు. ఆన్‌లైన్ గేమింగ్ లేదా పెట్టుబడుల ద్వారా తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనే ఆశతో డబ్బులు పంపవద్దని, ఏదైనా ప్రకటనను నమ్మే ముందు దాని నిజానిజాలను పరిశీలించాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# మార్కండేయ నగర్‌లో ఘనంగా శ్రీ దుర్గామాత శరన్నవరాత్రి పూజలు

- అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు



**గండిపేట, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మార్కండేయ నగర్‌లో శ్రీ దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మార్కండేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, నవోదయ యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండవ రోజు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ దీక్షలో ఉన్న సభ్యులు, మార్కండేయ నగర్ కాలనీ పెద్దలు, నవోదయ యూత్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ దుర్గామాతను దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. పూజల అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు నిర్వాహక కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తుల రాకతో కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. పూజలో పాల్గొన్నవారు ఏరువా సత్యనారాయణ ఏర్వ సత్యనారాయణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు విడెం రమేష్, సత్య సాయి పొదుపు సంఘం అధ్యక్షులు పగిడిమర్రి సూర్యనారాయణ, కోట శ్యాం కుమార్, నవోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కోట పవన్ కుమార్,మలేష్, భానుచందర్, ముశం నరేష్, నరేష్, బాలాజీ, మహేష్, సాయి,ఉమాకాంత్, నాని, వెంకటేష్,మహేష్,ఆకాష్, యశ్వంత్,హర్షిత్,రితీశ్,ధర్మ,సిద్ధి,ఐశ్వర్య, రాజ్యలక్ష్మి , శ్రీనిధి, దీక్షలో పాల్గొన్న సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఖమ్మంలో ఘనంగా జరుగుతున్న దేవీ నవరాత్రోత్సవాలు........తిలక్





**ఖమ్మం , అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆధ్యాత్మిక శోభతో ఖమ్మం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఖమ్మం నగరం గాంధీచౌక్ లో మెగా డైమండ్ యూత్ వారు నిర్వహిస్తున్న అమ్మవారి పూజలలో ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గం 'ఏ' బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, 3 టౌన్ ఏరియం కాంగ్రెస్ పార్టీ'కో' 'ఆర్డినేటర్ యర్రం బాలగంగాధర్ తిలక్ పాల్గొన్నారు. అమ్మవారి ఉత్సవ మండపాల్లో భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేశారని తిలక్ మండప నిర్వాహకులను అభినందించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతి భక్తునిపైన ఉండాలని తిలక్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పిల్లుట్ల వెంకన్న, గుడెపు నాగరాజు, కన్నన్ సర్వన్, , బాతరాజు నవీన్ కుమార్, గూడెపు నాగేశ్వర రావు, చల్లా రాకేష్, పిల్లుట్ల రామ్ చరణ్, ఆలకిరీటి, కన్నన్ జయప్రకాష్, సీతాళం సత్యసాయి నాయుడు, మరోజు సందీప్, వెలిశాల వెంకటేష్, వెలిశాల కార్తికేయ, భూమా సతీష్, గూడెపు దుర్గా మహేష్, తాళ్ళూరి కళ్యాణ్, గరిడేపల్లి రాజేష్, బలరాం యాదవ్, పవన్ యాదవ్, గంధపు సాయిరాం, చల్ల మురళీకృష్ణ, యలమందల రమేష్, కుమ్మకుంట్ల వంశీ, తాళ్లూరి మల్లిఖార్జున్, బాతరజు అరుణ్ కుమార్, నేరెళ్ల శివ, నేరెళ్ల కేశవ్, ఆవుల కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## స్టాలిన్ నగర్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు.

- బీఆర్ఎస్ నాయకులు అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో మహిళలకు బతుకమ్మ బహుమతుల పంపిణీ..



**మియాపూర్, (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మియాపూర్‌లోని స్టాలిన్ నగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అట్టేపల్లి రామప్రభు పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు ఎంతో అందంగా, ఆకర్షణీయంగా అలంకరించి తీసుకొచ్చిన బతుకమ్మలకు పోటీలు నిర్వహించారు. ఉత్తమంగా అలంకరించిన బతుకమ్మలకు మొదటి, రెండో, మూడో బహుమతులను అందజేశారు. అదే విధంగా మరికొన్ని బతుకమ్మలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో మరో మూడు బతుకమ్మలకు ప్రత్యేక బహుమతులను అందించారు. వేడుకల్లో పాల్గొన్న ఆడపడుచులందరికీ బతుకమ్మ కానుకలను అందజేసి పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ వేడుకలకు సుమారు 200 నుంచి 250 మంది మహిళలు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు, ఆటలు, సంప్రదాయ వేడుకలతో స్టాలిన్ నగర్ కాలనీ అంతటా పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్టాలిన్ నగర్ కాలనీ పెద్దలు, యువత, ఆడపడుచులు, అలాగే ఏ ఆర్ పి టీమ్ సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, "స్టాలిన్ నగర్ కాలనీ మహిళలు, పెద్దలు, యువతతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం, సంతోషాన్ని పెంపొందించవచ్చు. మియాపూర్ ప్రజలందరూ సంతోషంగా, ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలన్నదే నా ఆకాంక్ష. ప్రజలందరి సహకారం, ఆశీర్వాదాలతో మరిన్ని సేవా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అని ఆయన తెలిపారు.

## సిరికొండ మధుసూదనా చారి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కంజర్ల కృష్ణమూర్తి చారి..



**శేరిలింగంపల్లి, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ తొలి స్పీకర్, విశ్వకర్మ ముద్దుబిడ్డ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి పుట్టినరోజు సందర్భంగా కంజర్ల కృష్ణమూర్తి చారి సిరికొండమధుసూదనాచారి ని కలిసి శాలువాతో సత్కరించి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది, ఈ సందర్భంగా సోదరులు మధుసూదన చారి ఇటువంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయన తెలంగాణ రాష్ట్ర పోరాటంలోపాల్గొనీ మరియు ప్రజాసేవ మర్చిపోలేనిదని , అన్న మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కంజర్ల కృష్ణమూర్తి ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాచుపల్లి లో ఘనంగా అమ్మవారి పూజలు..



**బాచుపల్లి, అక్టోబరు14(జర్నలిస్ట్ ఫైల్) :** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రోజు బాచుపల్లిలో వీరేంద్ర ఆహ్వానం మేరకు అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ పవిత్రమైన కార్యక్రమంలో మన మియాపూర్ కు చెందిన ఎం ఆర్ కె చౌదరి , దొప్పలపూడి వినోద్ చౌదరి , పెద్దబాబు , కమలాకర్ రెడ్డి , రాజేష్ , యశ్వంత్ భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా నిర్వాహకులు వీరేంద్ర ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులకు ఘనంగా స్వాగతం పలికి, శాలువాలతో సన్మానించారు. నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఐక్యతకు ప్రతీక అని, అందరూ కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని వారు తెలిపారు.అమ్మవారి కృపతో అందరికీ సుఖ సంతోషాలు కలగాలని కోరుకుంటున్నాము అని నిర్వాహకులు తెలిపారు

## ఎఫ్‌సీఐ కాలనీలో శరన్నవరాత్రి దసరా ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్న యలమంచి ఉదయ్ కిరణ్



**మియాపూర్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మియాపూర్ ఎఫ్‌సీఐ కాలనీ పార్క్‌లో ఎఫ్‌సీఐ కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ దేవి శరన్నవరాత్రి–దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు డా. యలమంచి ఉదయ్ కిరణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా డా. యలమంచి ఉదయ్ కిరణ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జగన్మాత దుర్గాదేవి ఆశీస్సులు పొందారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా ఎఫ్‌సీఐ కాలనీ ఉత్సవ కమిటీ సభ్యులు చంద్ర మౌళి, ఆనంద్, మహేందర్ తదితరులు డా. యలమంచి ఉదయ్ కిరణ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాయుడు, నాగిరెడ్డి, గంగాధర్, సంజయ్, శరత్, కామినేని వాసు, వంశీ, నాని, అశోక్, ప్రవీణ్, రాజశేఖర్, రత్నాచారి, వినోద్, శశి తదితరులతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు నివాసంలో బతుకమ్మ సంబరాలు...

- బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మను పేర్చి , ఆడి పాడిన బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు..
- తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలకు చీర సారే తో ఘనంగా సత్కరించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర..





**ఖమ్మం, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బతుకమ్మ ఘనంగా జ రుగుతున్న సంబురాల్లో పాల్గొనేందుకు ఖమ్మం చేరుకున్న బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సాదర స్వాగతం పలికారు. మధ్యాహ్నం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర నివాసానికి చేరుకున్న ఆడబిడ్డలు.. స్వయంగా పాటలు పాడుతూ, సాంప్రదాయ బద్ధంగా బతుకమ్మ పేర్చారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ విప్ గొంగడి సునితా రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, మాజీ కార్పొరేషన్ చైర్ పర్సన్లు రజినీ సాయిచంద్, మంత్రి శ్రీదేవి, వద్దిరాజు అనీల పలువురు మహిళల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దగ్గరుండి మహిళ నేతలకు పూలు, పూజా సామాన్లను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అందజేశారు. సోదరీమణులు పాటలు పాడుతూ బతుకమ్మలు పేరుస్తుంటే రవిచంద్ర సాయం అందించారు. అనంతరం వద్దిరాజు రవిచంద్ర నివాసంలో బీఆర్ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు బృందం బతుకమ్మ ఆడారు. తన ఇంటికి విచ్చేసిన మహిళా సోదరీమణులందరినీ సాదరంగా ఆహ్వానించిన వద్దిరాజు కుటుంబ సభ్యులు.. వారిని చీర సారె తో సత్కరించారు.

## విద్యావంతుల ఓటు.. ప్రజాస్వామ్యానికి బలం!

- మలేషియన్ టౌన్‌షిప్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం



**కూకట్‌పల్లి , అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యావంతుల చురుకైన భాగస్వామ్యంతోనే సమాజంలో మార్పు సాధ్యమని మేడ్చల్ అర్బన్ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్ పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో కూకట్ పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్ (RTP) కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లలో అర్హులైన పట్టభద్రుల కోసం ప్రత్యేక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టభద్రులు ఉత్సాహంగా పాల్గొని ఓటరు నమోదుకు ముందుకు వచ్చారు.ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని, అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి నమోదు చేసుకున్న పట్టభద్రులకు, కార్యక్రమ నిర్వహణకు సహకరించిన కమ్యూనిటీ సభ్యులకు నర్వ పవన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## డాక్టర్ రవీందర్ నాయక్ (చౌకిదర్) కి సన్మానం



**వరంగల్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇటీవల మహబూబాబాద్ ప్రభుత్వ హాస్పిటల్ నుండి ప్రమోషన్ లో భాగంగా వరంగల్ జిల్లాలోని ఎంజీఎం హెచ్ కి విచ్చేసిన డాక్టర్ మాలోతు రవీందర్ నాయక్ (చౌకిధర్) గారిని సామాజిక జాతీయ భావం గల ఉద్యమ నేత , ఉప సర్పంచ్ లా ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షులు తెలంగాణ శ్రీనివాస్ నాయక్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు .. అలాగే డాక్టర్ గారి జీవితాలు కల్మషం లేని మన తత్వాలు చూస్తే ప్రత్యక్షంగా కొలిచే దైవాలుగా కొనియాడ బడుతున్నారని అన్నారు పేదవాళ్ల డాక్టర్లుగా అనేకమంది నిస్వార్థ సేవలందిస్తున్నారు వీరి సేవలను గుర్తించకుండా "పైరవీ "లతో ఇతర డాక్టర్లకు పద్మ విభూషణ్ అవార్డులు కేటాయించడం బాధాకరమని తెలంగాణ శ్రీనివాస్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ధారావతు రఘునాయక్, ఈదునూరి మహేందర్, గార్డ్ శ్రీను చంధ్య నాయక్, శ్రీమతి దివ్య తదితరులు పాల్గొన్నారు

## కొత్తపేటలో ఉద్యోగాల జాతర.. 130 మంది యువతకు ఉపాధి భరోసా





**కేశంపేట, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కొత్తపేట గ్రామంలో తొలిసారిగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. మాజీ సర్పంచ్ కామ్లేకార్ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి యువత నుంచి మంచి స్పందన లభించింది.ఈ జాబ్ మేళాలో ప్రముఖ ఫాక్స్‌కాన్, ఆవిష్కరణ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ సంస్థల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను అభ్యర్థులకు వివరించారు. వివిధ ఉద్యోగాల కోసం హాజరైన యువతీ యువకులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించి, మొత్తం 130 మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఇందులో 95 మంది యువతులు, 35 మంది యువకులు ఉన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోనే ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నిరుద్యోగ యువతకు ఆర్థిక స్వావలంబన సాధించే అవకాశం లభిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఉద్యోగాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులను తగ్గించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కొత్తపేటలో తొలిసారిగా నిర్వహించిన ఈ జాబ్ మేళా యువతలో కొత్త ఆశలు నింపింది. భవిష్యత్తులోనూ మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కర్నాటి దర్శన్, మాజీ ప్రజాప్రతినిధులు మల్లేష్ యాదవ్, జమాల్ ఖాన్, కుంటి లక్ష్మయ్య, జగన్ రెడ్డి, నరేష్ యాదవ్, వార్డు సభ్యులు కాకునూర్ కృష్ణ, కుంటి పద్మ, చుక్క శ్రీను, నందిగామ శిరీష రాజు, నాయకులు నవీన్, విజయ్ కుమార్, కృష్ణ గౌడ్, సురేష్ గౌడ్, పెరుమాళ్ల సతీష్, రమేష్, కొండి రమేష్, సందీప్, శ్రీను, కృష్ణ, గొడుగు శివ, హరీష్, మల్లి అరుణ్, ఆంజనేయులు, నాగరాజు, యాదగిరి, ప్రవీణ్ తదితరులతో పాటు ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులు నవీన్, రాహుల్ పాల్గొన్నారు.

## చౌదరిగూడ లో నూతన సీసీ రోడ్డు పనుల శ్రీకారం!



**శంషాబాద్ , అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల పరిధిలోని చౌదరిగూడ గ్రామంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. చౌదరిగూడ సర్పంచ్ లక్ష్మీలింగం గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దలతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టారు. అనంతరం కాంక్రీట్ మిక్సర్ వాహనం ద్వారా పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీలింగం మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే ప్రజలకు ఏళ్ల తరబడి ఉన్న రవాణా కష్టాలు తీరనున్నాయని చెప్పారు. గ్రామ వికాసంలో రహదారుల పాత్ర అత్యంత కీలకమని, అందుకే గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పనులను పరిశీలించారు.

## ఓటు చోరీ ఆరోపణలపై ప్రధాని స్పందించాలి

- హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కరీంనగర్ జిల్లాలో కలపాలి
- గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి
- చాడ వెంకటరెడ్డిమాజీ ఎమ్మెల్యే, సీపీఐ సీనియర్ నేత



**హుస్నాబాద్, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో ఓటు చోరీకి సంబంధించిన ఆరోపణలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించాలని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కోరారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఓటు చోరీ అంశంపై ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై వస్తున్న విమర్శల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించాలని చాడ వెంకటరెడ్డి అన్నారు. ఈ అంశంపై వివిధ వర్గాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయని పేర్కొంటూ, సంబంధిత ఆరోపణలపై సమగ్రంగా స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.మూడు మండలాలను కరీంనగర్ జిల్లాలో కలపాలిహుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కరీంనగర్ జిల్లాలో కలపాలని చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో హుస్నాబాద్‌కు పాదయాత్రగా వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీ ఇచ్చి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ నిర్ణయం అమలులోకి రాలేదని పేర్కొన్నారు. సంబంధిత మండలాలను కరీంనగర్ జిల్లాలో కలిపే ప్రక్రియను ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.గతంలో ఈ అంశాన్ని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఆశించిన నిర్ణయం వెలువడలేదని చాడ వెంకటరెడ్డి తెలిపారు.గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను పూర్తి చేయాలిహుస్నాబాద్ ప్రాంత రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు ప్రజలకు తాగునీరు అందించేందుకు గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.2007లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఈ ప్రాజెక్టుల పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. గండిపల్లి ప్రాజెక్టు పనులు సుమారు 40 శాతం మాత్రమే పూర్తయ్యాయని పేర్కొంటూ, మిగిలిన పనుల పురోగతిపై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు.ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటనలు చేయడంతో పాటు, అవసరమైన నిధులను కేటాయించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. హుస్నాబాద్ ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలిఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్‌కు విజయం సాధించిన కార్మికులకు చాడ వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలు, హక్కులు, న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సీపీఐ తరపున వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ప్రజా సమస్యలపై పోరాటంరాష్ట్రంలో ప్రజా పాలన, ప్రభుత్వ విధానాలను పరిశీలిస్తున్నామని చాడ వెంకటరెడ్డి అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఐ త్వరలో కార్యాచరణ రూపొందించి పోరాటాలు చేపడుతుందని వెల్లడించారు.విలేఖరుల సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ కన్వీనర్ జాగీర్ సత్య నారాయణ, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పొదిల కుమారస్వామి, సిపిఐ మండల నాయకులు పిట్టల మెగిలయ్య, ఎనగందుల లక్ష్మి నారాయణ, పిట్టల ప్రసాద్,అయి లేని మల్లారెడ్డి, పిట్టల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.అధికారులు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మధుసూదనాచారి జన్మదినం సందర్భంగా 'రెడీ టు సర్వ్ ఫౌండేషన్'లో సేవా కార్యక్రమాలు

- వృద్ధులకు అన్నదానం.. బెడ్‌షీట్లు, నిత్యావసర సరుకుల పంపిణీ
- వనస్థలిపురం వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమం





**వనస్థలిపురం, అక్టోబరు 14 (జర్నలిస్ట్ ఫైల్) :** శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శివప్రకాష్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని ఓ వృద్ధాశ్రమంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేయడంతో పాటు బెడ్‌షీట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజంలో మానవత్వం, సేవాభావం మరింత పెంపొందుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా శివప్రకాష్ మాట్లాడుతూ.. సిరికొండ మధుసూదనాచారి మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయన చేపట్టే ప్రయత్నాలన్నీ విజయవంతం కావాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకున్నారు. భగవంతుడు ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజన నాయకులు నవీన్, రాకేష్, వినయ్ కుమార్, రవి యాదవ్, సాయి యాదవ్, కళ్యాణ్, రాజ్, లక్కీ గౌడ్, శరత్, కౌశిక్, వంశీ, మజీద్, నవీన్ కుమార్, పవన్, నరేష్, ఆసిఫ్, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ



○ భద్రతా ఏర్పాట్లపై అధికారులకు కీలక సూచనలు

**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర పరిధిలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక పోలీస్, ఎన్నికల అధికారులతో కలిసి పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలను ఆయన పరిశీలించారు.

నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటప్పయ్య కాలనీ ఎంపీపీ స్కూల్, ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం స్కూల్, పట్టాభిపురం పరిధిలోని జేకేసీ కాలేజ్, అరండల్‌పేట పరిధిలోని సంజీవయ్య నగర్ ఎంపీపీ స్కూల్‌ను ఎస్పీ పరిశీలించారు. అలాగే కొత్తపేట పరిధిలోని జలగం రామారావు మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ ఉర్దూ బాయ్స్ హైస్కూల్, పాత గుంటూరు పరిధిలోని ఇజ్రాయిల్‌పేట ఎంపీపీ హైస్కూల్, బుర్ర నాగేశ్వరరావు మున్సిపల్ హైస్కూల్, యాదవ హైస్కూల్, లాలాపేట పరిధిలోని మహావీర్ స్కూల్ తదితర కేంద్రాలను సందర్శించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన భద్రత, బారికేడ్లు, క్యూ లైన్లు, అవసరమైన మౌలిక సదుపాయాలు, ఓటర్ల ప్రవేశం, నిష్క్రమణ మార్గాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల సమీపంలోని ఇళ్ల యజమానుల వివరాలను సేకరించాలని, ఎన్నికల రోజున కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా అక్కడ నివాసం ఉండకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సమస్యాత్మక పరిస్థితులు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు.

ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీస్, ఎన్నికల అధికారులు, ఇతర శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వకుల్ జిందాల్ సూచించారు. పోలింగ్ రోజున శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

## వృద్ధులకు అన్నదానం



**తెనాలి, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక ప్రగడకోటయ్యనగర్ కు చెందిన చిన్నారి అందె తన్మయిపుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నందులపేటలోని షిరిడి సాయి సేవా సమితి వారు నిర్వహిస్తున్న పట్టణ పేద నిరాశ్రయుల వసతి గృహంలో తన్మయి, ఆమె తల్లిదండ్రులు అందె బాలచంద్రమౌళి, రాజేశ్వరి దంపతులు శ్రీ వెంకటేశ్వర యోగ కేంద్ర నిర్వాహకులు ముద్దాబత్తుని రమణయ్య తో కలిసి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా యోగ సాధకులు రమణయ్య మాట్లాడుతూ పుట్టినరోజును పురస్కరించుకొని వృద్ధులకు అన్నదానం చేయటం సంతోషకరమన్నారు. చిన్నారి తన్మయి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. దాత అందెబాలచంద్రమౌళి మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అని భావించి వృద్ధులకు తమ కుమార్తె తన్మయి పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారికి వృద్ధులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెనాలి పట్టణ పద్మశాలి ఉద్యోగుల అధ్యక్షులు తిరువీధులనాగేశ్వరరావు, మైలా అప్పారావు,ఆశ్రమ సేవకులు మానేపల్లి ఆనందలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారిమఠంలో వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రం లోని అమ్మవారి శాలలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సర్వాలంకార శోభితగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తజనంతో సందడిగా మారింది.

అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు తమ కుటుంబాలపై ఉండాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారి శాలను పండుగ వాతావరణం ప్రతిబింబించేలా అలంకరించడంతో పాటు భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దసరా నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తుండటంతో బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

భక్తుల విశేష స్పందనతో అమ్మవారి శాల పరిసరాలు భక్తిమయంగా మారాయి. రానున్న రోజుల్లోనూ నవరాత్రి ఉత్సవాలు మరింత వైభవంగా కొనసాగనున్న నేపథ్యంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఇన్నర్ రింగ్ రోడ్డుకు మరో రూ.6 కోట్లు : కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని

○ మిగిలిన 350 మీటర్ల రహదారి నిర్మాణానికి అదనపు నిధులు

○ నగర రహదారి అనుసంధానత మెరుగుదలకు కీలక ముందడుగు

○ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం



**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్–III నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్‌డీఏ) అదనంగా రూ.6 కోట్ల నిధులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. మిగిలిన 350 మీటర్ల రహదారి నిర్మాణానికి ఈ నిధులను వినియోగించనున్నారు. నిధుల మంజూరుపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

జేకేసీ కాలేజీ రోడ్డు (స్వర్ణభారతి నగర్) నుంచి పెదపలకలూరు రోడ్డు వరకు ఫేజ్–III కింద చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో చైనేజ్ 3.900 నుంచి 4.250 వరకు ఉన్న 350 మీటర్ల రహదారి పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. ఈ భాగం నిర్మాణానికి ఏపీసీఆర్‌డీఏ నిధుల నుంచి రూ.6 కోట్లు మంజూరు చేస్తూ కమిషనర్ విజయ్ రామరాజు అక్టోబర్ 13న ఉత్తర్వులు జారీ చేశారు.

గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్–IIIలో శిల్పారామం నుంచి పెదపలకలూరు జంక్షన్ వరకు మొత్తం 4.25 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి గత ఏడాది ఏపీసీఆర్‌డీఏ ద్వారా రూ.48 కోట్ల అంచనా వ్యయంతో అనుమతులు మంజూరయ్యాయి. ఈ పనులకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, స్థానిక ఎమ్మెల్యే రామాంజనేయులు కలిసి శంకుస్థాపన చేశారు. నిర్మాణంలో అదనపు పనుల అవసరం ఏర్పడటంతో మొత్తం 4.25 కిలోమీటర్లలో సుమారు 3.90 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి.

మిగిలిన 350 మీటర్ల రహదారి నిర్మాణానికి అదనపు నిధులు అవసరం కావడంతో ఏపీసీఆర్‌డీఏకు ప్రతిపాదనలు పంపించారు. వాటిని పరిశీలించిన అనంతరం ఫేజ్–III పనులకు అదనంగా రూ.6 కోట్లను మంజూరు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిధులతో మిగిలిన రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసే అవకాశం ఏర్పడింది.

ఇదిలా ఉండగా, రహదారి నిర్మాణానికి ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి పనుల కోసం గుంటూరు నగరపాలక సంస్థ ఇప్పటికే రూ.1.72కోట్లను చెల్లించింది. విద్యుత్ స్తంభాల మార్పిడి, మిగిలిన రహదారి నిర్మాణానికి అవసరమైన నిధుల సమకూర్పుతో పనులను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

మిగిలిన 350 మీటర్ల రహదారి నిర్మాణానికి నిధుల మంజూరు విషయంలో పెమ్మసాని చంద్రశేఖర్ అక్టోబర్ 3న రాసిన లేఖను కూడా ఏపీసీఆర్‌డీఏ జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. నగరంలోని కీలక ప్రాంతాలను అనుసంధానించే ఈ రహదారి పూర్తయితే ఆయా ప్రాంతాల మధ్య ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్–III పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే గుంటూరు నగరంలో రహదారి అనుసంధానత మరింత మెరుగుపడనుంది. ముఖ్యంగా పెదపలకలూరు, స్వర్ణభారతి నగర్, జేకేసీ కాలేజీ రోడ్డు, శిల్పారామం తదితర ప్రాంతాల మధ్య రాకపోకలకు సౌకర్యం కలగనుంది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా రహదారి మౌలిక వసతులను బలోపేతం

# అర్హులైన ఉపాధ్యాయులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి

○ ఎలక్టోరల్ రోల్స్ రూపకల్పనలో ఎలాంటి ఫిర్యాదులకు తావివ్వొద్దు

○ ఆరు జిల్లాల అధికారులతో సమీక్షించిన డి ఆర్ ఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి



**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఎలక్టోరల్ రోల్స్ తయారీలో అర్హత కలిగిన ప్రతి ఉపాధ్యాయుడిని ఓటరుగా నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి అధికారులను ఆదేశించారు.

ఉమ్మడి కృష్ణా–గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల ఓటరు జాబితా తయారీపై బుధవారం ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు చెందిన రెవెన్యూ అధికారులు, ఎంపీడీవోలు యం ఈ ఓ లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాల తయారీ, ఉపాధ్యాయుల అర్హతలు, నమోదు ప్రక్రియ, నిర్ణీత గడువులోగా జాబితాల ప్రచురణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎలక్టోరల్ రోల్స్ తయారీలో ఎలాంటి పొరపాట్లకు, ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఉన్నత పాఠశాలలు, ఆపై స్థాయి విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదయ్యేందుకు అర్హులని తెలిపారు. నవంబర్ 1, 2026 నాటికి గత ఆరు సంవత్సరాల కాలంలో కనీసం మూడు సంవత్సరాల బోధనా అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సాధారణ ఓటరుగా నమోదై ఉండాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ గుర్తింపు కలిగి ఉండాలని వివరించారు. పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఓటరుగా నమోదుకు అర్హులు కారని స్పష్టం చేశారు. ఓటరు నమోదుకు సంబంధించిన నిబంధనలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులైన ఉపాధ్యాయులెవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఎలక్టోరల్ రోల్స్ తయారీకి సంబంధించి నవంబర్ 25, 2026న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు, డిసెంబర్ 30, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ గడువులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్ణీత సమయంలోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

అలాగే కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు నమోదు అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. విస్తృత ప్రచారం ద్వారా ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి, ఎలక్టోరల్ రోల్స్ తయారీ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి సూచించారు.

## పశ్చిమలో మాకు ఒక్క డివిజనేనా..! గల్లా మాధవిపై ఎస్సీలు గరమ్ గరమ్



**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** ఎస్సీలంటే చంద్రబాబుకు మొదటి నుంచి చిన్న చూపేనని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గుంటూరు నగర అధ్యక్షుడు పాటిబండ్ల కిరణ్ (ఆలా) ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా... అన్న చందంగా చంద్రబాబుకు తగినట్లే గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి వ్యవహరిస్తుందని ఆయన విరుచుకుపడ్డారు. అందుకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గానికి కేవలం ఒకే ఒక్క డివిజన్ కేటాయించడమే అందుకు నిదర్శనమని ఆయన నిందించారు.

బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలా కిరణ్ మాట్లాడుతూ, తరచూ ఎస్సీలను చులకన చేయడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా... అంటూ గతంలో చంద్రబాబు బాహాటంగానే అవహేళన చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. లోగడ శింగనమల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీరాంజనేయులును ఘోరంగా అవమానించడం ద్వారా పేదలు, కార్మికులు, డ్రైవర్లు, దళితులు ఎన్నికల్లో పోటీకి పనికిరారనే రీతిలో కించపరిచిన వైనాన్ని కూడా ఆయన ఉదహరించారు. దీన్ని బట్టి చూస్తేనే బదుగు, బలహీన వర్గాలంటే బాబు దృష్టిలో కేవలం తమకు ఓట్లు వేసి, అగ్రకుల దురహంకారుల అడుగులకు మడుగులొత్తే వారు మాత్రమేనన్న సంగతి అర్ధమౌతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో చంద్రబాబునే ఆదర్శంగా తీసుకున్న ఎమ్మెల్యే గల్లా మాధవి తన సొంత నియోజకవర్గంలో ఎస్సీలపై పూర్తి అణిచివేత దోరణితో ముందుకు సాగుతున్నారని ఆరోపించారు. కేవలం ఒక్క వార్డు మాత్రమే ఎస్సీలకు రిజర్వ్ అయ్యేలా చక్రం తిప్పి తన దళిత వ్యతిరేకతను బహిరంగంగా చాటుకున్నారని భగ్గుమన్నారు. ఎస్సీ ఓటర్లు ఈ పరిణామాలను నిశితంగా పరిగణనలోకి తీసుకుని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, మాజీ కార్పొరేటర్ బోడపాటి కిషోర్ మాట్లాడుతూ, ఎస్సీలపై కపట ప్రేమ చూపే కూటమి పార్టీలను కట్టగట్టి బంగాళాఖాతంలో కలిపే రోజులు దగ్గరపడ్డాయని ధ్వజమెత్తారు. ఎస్సీలు తిరగబడి తెలుగుదేశం తలరాతను మార్చే సమయం ఆసన్నమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్సీ నేతలు దర్శనపు అశోక్, అచ్చిబాబు, కంచర్ల బాలు, మహేంద్ర, ఏబు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ గడువు పొడిగింపు

**గుంటూరు, అక్టబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు SIR--2026 ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువును పొడిగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి గతంలో నిర్ణయించిన గడువును ఈ నెల 22వ తేదీ వరకు పొడిగించినట్లు వెల్లడించారు. అర్హులైన పౌరులందరికీ అవకాశం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని చెప్పారు. పరిష్కార ప్రక్రియ ముగిసిన అనంతరం, అన్ని సవరణలతో కూడిన తుది ఓటరు జాబితాను అక్టోబర్ 30న అధికారికంగా ప్రచురించడం జరుగుతుందని వివరించారు.

# నిష్పక్షపాతంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి

○ ఆర్వోలు, ఏఆర్వోలపై కీలక బాధ్యత ఉంది: కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు నగర పాలక సంస్థ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించే బాధ్యత రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు)పై ఉందని నగర కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులకు నియమితులైన ఆర్వోలు, ఏఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిందని, నిర్ణీత గడువులో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం రూపొందించిన షెడ్యూల్ ప్రకారం అధికారులు విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. వార్డుల వారీగా ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయాల నుంచే అధికారులు ప్రతిరోజూ విధులు నిర్వహించాలని ఆదేశించారు.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలోనే పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని, ప్రతిరోజూ వచ్చిన నామినేషన్ల వివరాలను డిస్ప్లే బోర్డులో ప్రదర్శించాలని సూచించారు.

19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రతి డివిజన్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కచ్చితంగా అమలు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

అధికారులు ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించకుండా ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాల సహకారంతో రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు, పోస్టర్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలను వివరించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్లు ఐ. కిషోర్, జి. రవీంద్ర, డీసీలు బి. శ్రీనివాసరావు, సాంబశివరావు, సి. హెచ్. శ్రీనివాస్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, మేనేజర్ బాలాజీ బాష, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మతో పాటు ఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ గోవిందమాంబ అమ్మవారు



**బ్రహ్మంగారిమఠం, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్ ):** బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లాయపల్లెలోని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారి దివ్య ఆశీస్సులతో బుధవారం నాలుగో రోజు ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్టు మేనేజర్ పి.పి.ఎన్.ప్రసాద్ తెలిపారు.

ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో శ్రీ గోవిందమాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వేంకటాద్రి స్వాముల వారు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల భాగస్వామ్యంతో సామూహిక కుంకుమార్చన పూజను నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

రాత్రి చతుర్థ అఖండ స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మఠ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

తాత్కాలిక ఉభయదాతలు మాసనపల్లె గ్రామానికి చెందిన గూడూరు వెంకటరెడ్డి, వారి ధర్మపత్ని రామలక్ష్మమ్మ, వారి కుమారుడు రాజశేఖర్ రెడ్డి (దువ్వూరు మండలం, కడప జిల్లా). తాత్కాలిక ఆధ్వర్యులు: శ్రీ ఇడమకంటి జనార్ధన శివాచార్య, శ్రీ పోలేపల్లి రామబ్రహ్మం.

## మాస్టర్స్ అథ్లెటిక్స్ విజేతలకు ఎస్పీ అభినందనలు



○ ఏపీ స్టేట్ 45వ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పోలీస్ సిబ్బంది ప్రతిభ

**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అక్టోబర్ 10, 11 తేదీల్లో నిర్వహించిన ఏపీ స్టేట్ 45వ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన గుంటూరు జిల్లా పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

పోటీల్లో ఎం. లక్ష్మయ్య (పీసీ) హ్యామర్ త్రో, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో విభాగాల్లో రెండు బంగారు, ఒక కాంస్య పతకం సాధించారు. డి. కిరణ్ కుమార్ (పీసీ) 1500 మీటర్లు, 5కే రన్ విభాగాల్లో ఒక బంగారు, ఒక రజత పతకం సాధించారు. జి. కృష్ణ కిషోర్ (హోంగార్డ్) 5కే వాక్, 10కే రన్, హైజంప్‌లో రెండు బంగారు, ఒక రజత పతకం సాధించారు. ఎం. అశోక్ చక్రవర్తి (పీసీ) 5కే వాక్‌లో రజత పతకం సాధించారు.

బి. కృష్ణారావు (పీసీ) హ్యామర్ త్రో, డిస్కస్ త్రోలో ఒక బంగారు, ఒక రజత పతకం సాధించగా, మైల సాంబశివరావు (ఏఎస్ఐ) పోల్ వాల్ట్, 400 మీటర్ల రన్, హైజంప్‌లో రెండు రజత, ఒక కాంస్య పతకాలు సాధించారు. ఐ.ఆర్. చంద్రశేఖర్ (ఏఆర్ఎస్ఐ) హ్యామర్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్‌లో ఒక బంగారు, రెండు రజత పతకాలు సాధించారు.

రిటైర్డ్ ఏఎస్ఐ కె. రాజశేఖర్ బాబు 10కే రన్, వాక్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించారు. వి. దివాకర్ హ్యామర్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రోలో రెండు బంగారు, ఒక రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ విజేతలను అభినందిస్తూ, పోలీస్ సిబ్బంది క్రీడా రంగంలోనూ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## నీట్‌లో ప్రతిభ చాటిన షేక్ షాహిన్




### ○ నీట్‌లో 7000వ ఆల్ ఇండియా ర్యాంక్ సాధన

**కనిగిరి, అక్టోబర్ 14 (జర్నలిస్ట్ ఫైల్):** పామూరు పట్టణానికి చెందిన షేక్ షాహిన్ జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షలో 7000వ ఆల్ ఇండియా ర్యాంక్ సాధించి ప్రతిభ చాటారు. ఆమె కనిగిరి నియోజకవర్గం పామూరు మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్ మొహిద్దిన్ సోదరుడు షేక్ మునీర్ భాష, హబీబ్ దంపతుల కుమార్తె.
నీట్‌లో ప్రతిభ కనబరిచిన షేక్ షాహిన్‌ను హైదరాబాద్‌లోని భాటియా మెడికల్ కోచింగ్ సంస్థ ప్రతినిధులు మెమెంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా షాహిన్‌ను అభినందిస్తూ, వైద్య విద్యను పూర్తి చేసి భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.
షేక్ షాహిన్ సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు. తాతయ్య షేక్ మహబూబ్ పీరా, అమ్మమ్మ జహేరా, మేనమామలు, మేనత్తలు, పెదమ్మ గులాబ్, సోదరి, సోదరులు షాహిన్‌ను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఏవీఎస్ రాజు మృతిపట్ల సీఎం చంద్రబాబు సంతాపం

### ○ దేశ నిర్మాణంలో ఆయన సేవలు చిరస్మరణీయం

**అమరావతి,అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):** నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవస్థాపకులు, చైర్మన్, పద్మశ్రీ డాక్టర్ అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఎంతో విచారకరమని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లాలోని అంతర్వేదిపాలెంలో జన్మించిన ఏవీఎస్ రాజు నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీని స్థాపించి విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. నిబద్ధత, నిజాయతీతో కూడిన దార్శనిక పారిశ్రామికవేత్తగా దేశ నిర్మాణం, అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చంద్రబాబు పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంతో పాటు ఎన్‌సీసీ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో పేదలకు అండగా నిలిచారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి తదితర సామాజిక కార్యక్రమాలను చేపట్టారని గుర్తుచేశారు. ఏవీఎస్ రాజు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు చంద్రబాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి పనిచేయాలి



### ○ డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం జయంతి

**తాడేపల్లి, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, గొప్ప ఉపాధ్యాయుడు డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఆఫీసర్ (ఉర్దూ) షేక్ నాగూర్ వలి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. సైన్స్, విద్య, జాతీయ అభివృద్ధి రంగాల్లో కలాం అందించిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.
1931 అక్టోబర్ 15న తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించిన డాక్టర్ కలాం భారత క్షిపణి కార్యక్రమం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. దీంతో ఆయనను 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు. నిరాడంబర జీవనం, క్రమశిక్షణ, నిరంతర కృషి, దేశభక్తి వంటి లక్షణాలతో కోట్లాది మంది భారతీయులకు, ముఖ్యంగా విద్యార్థులు, యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని షేక్ నాగూర్ వలి పేర్కొన్నారు.
కలాం జీవితం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, పెద్ద కలలు కనాలని, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులను గౌరవించాలని తెలిపారు.
కలాం ఆలోచనల స్ఫూర్తితో యువత తమ ప్రతిభను దేశాభివృద్ధికి వినియోగించాలని, విద్య ద్వారా నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని షేక్ నాగూర్ వలి ఆకాంక్షించారు.

## స్కూల్, కాంప్లెక్స్ గ్రాంట్లను పాత విధానంలోనే జమ చేయాలి

### ○ వెండర్ల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని రద్దు చేయాలి: ఆర్.జే.యు.పీ. ప్రధాన కార్యదర్శి షరీఫ్



**అమరావతి,అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):** స్కూల్ గ్రాంట్లు, స్కూల్ కాంప్లెక్స్ గ్రాంట్లు, ఎస్ఎంసీ గ్రాంట్లను గతంలో మాదిరిగానే నేరుగా ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని కొనసాగించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్.జే.యు.పీ.) ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ కోరారు. గ్రాంట్లను థర్డ్‌పార్టీ వెండర్ల ఖాతాల్లో జమ చేసే విధానాన్ని విద్యాశాఖ ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.
గతంలో పాఠశాలలకు సంబంధించిన గ్రాంట్లను నేరుగా ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమ చేసి, అనంతరం ఖర్చులకు సంబంధించిన బిల్లులను అప్లోడ్ చేసే విధానం అమల్లో ఉండేదని షరీఫ్ తెలిపారు. అయితే ఇటీవల ముందుగా బిల్లులు అప్లోడ్ చేయాలని, అనంతరం గ్రాంట్లను ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో కాకుండా వెండర్ల ఖాతాల్లో జమ చేసేలా ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.
ఈ నెల 14వ తేదీలోగా బిల్లులు అప్లోడ్ చేయాలని అధికారులు ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం సరికాదని ఆయన అన్నారు. ముఖ్యంగా దసరా సెలవుల సమయంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను బిల్లుల అప్లోడింగ్ పేరుతో ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు.
పాఠశాలల అవసరాలకు సంబంధించిన గ్రాంట్ల వినియోగంలో ప్రధానోపాధ్యాయులకు గతంలో ఉన్న విధానాన్నే కొనసాగించాలని, వెండర్ల ఖాతాల్లో నిధులు జమ చేసే విధానాన్ని రద్దు చేసి పాఠశాలల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా చూడాలని షరీఫ్ విద్యాశాఖను కోరారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భద్రత : మంత్రి సవిత

### ○ 70 మందికి రూ.31.43 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
### ○ 28 నెలల్లో 1,461 మందికి రూ.15.75 కోట్ల సాయం: మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీ సత్య సాయి, అక్టోబరు 14(జర్నలిస్ట్ ఫైల్):** పేద, మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి సహాయ నిధి ప్రధాన ఉద్దేశమని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం 70 మంది లబ్ధిదారులకు రూ.31,43,227 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, పెనుకొండ నియోజకవర్గ పరిధిలో గడిచిన 28 నెలల్లో 1,461 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం రూ.15 కోట్ల 75 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన పేదలకు పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా పేద మధ్యతరగతి కుటుంబాల ఆరోగ్య భద్రతకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం ఎంతో మేలు చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో నూతన పెన్షన్లు అందజేయడంతో పాటు పేదలకు గృహ వసతి కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకు,లు కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ సాధించిన ఎన్ఆర్ఐ అధ్యాపకుడు రాంబాబు

### ○ వీఎల్ఎస్ఐ సాంకేతిక పరిజ్ఞానంలో పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా
### ○ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందనలు



**గుంటూరు, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకుడు చీమకుర్తి రాంబాబు పీహెచ్‌డీ పట్టా సాధించారు. సిక్కిం ఆల్పైన్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టా పొందినట్లు ఎన్ఆర్ఐ విద్యాసంస్థల యాజమాన్యం వెల్లడించింది.
వీఎల్ఎస్ఐ విభాగంలో "అనలిటికల్ మోడలింగ్ ఆఫ్ సీఎంఓఎస్ డివైసెస్ ఫర్ స్కేల్డ్ వీఎల్ఎస్ఐ టెక్నాలజీస్" అనే అంశంపై రాంబాబు పరిశోధన చేశారు. డాక్టర్ దోలా సంజయ్ మార్గదర్శకత్వంలో పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు.
ఆధునిక సెమీకండక్టర్ సాంకేతిక పరిజ్ఞానంలో కీలకమైన సీఎంఓఎస్ డివైసెస్ పనితీరు, స్కేలింగ్ టెక్నాలజీస్, అనలిటికల్ మోడలింగ్ తదితర అంశాలపై పరిశోధన ప్రధానంగా సాగింది. భవిష్యత్తులో అధునాతన ఎలక్ట్రానిక్ డివైసెస్, మైక్రోచిప్స్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ రూపకల్పనలో ఈ పరిశోధన ఉపయోగపడే అవకాశం ఉందని కళాశాల ప్రతినిధులు తెలిపారు.
రాంబాబు సాధించిన డాక్టరేట్‌పై ఎన్ఆర్ఐ విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందనలు తెలిపారు. అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధన, అభివృద్ధి రంగాల్లోనూ ముందుకు సాగడం విద్యాసంస్థల ప్రగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అధ్యాపకుల పరిశోధనా విజయాలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు మాట్లాడుతూ, అధ్యాపకులు నిరంతరం తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ నూతన టెక్నాలజీలపై పరిశోధనలు చేయడం అభినందనీయమన్నారు. కళాశాలలో పరిశోధనా వాతావరణాన్ని మరింత బలోపేతం చేసేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శరత్ మాట్లాడుతూ, రాంబాబు పీహెచ్‌డీ సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. అధ్యాపకులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పరిశోధనలు చేపట్టి విద్యాసంస్థకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.
కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దోలా సంజయ్ మాట్లాడుతూ, వీఎల్ఎస్ఐ వంటి అత్యాధునిక సాంకేతిక రంగంలో డాక్టరేట్ సాధించడం విశేషమన్నారు. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ టెక్నాలజీకి ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిశోధనకు ప్రాముఖ్యత ఉందని తెలిపారు. రాంబాబు భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేపట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.
వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరి మాట్లాడుతూ, రాంబాబు సాధించిన విజయం ఇతర అధ్యాపకులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. అధ్యాపకుల పరిశోధనా విజయాలు విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు, పరిశోధనల పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది రాంబాబును అభినందించారు.

## 75 గంటల డప్పు మారథాన్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు

### ○ 2,000 మందికి పైగా కళాకారులతో నిరంతర డప్పు ప్రదర్శన
### ○ తిరుపతిలో ఘనంగా ముగిసిన ప్రపంచ రికార్డు కార్యక్రమం



**తిరుపతి, అక్టోబర్ 13(జర్నలిస్ట్ ఫైల్):** తిరుపతి తారకరామా స్టేడియంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 75 గంటల డప్పు మారథాన్ విజయవంతంగా ముగిసింది. ఈ నెల 10న ప్రారంభమైన కార్యక్రమం మంగళవారం సాయంత్రం 6 గంటలకు పూర్తయింది. 2,000 మందికి పైగా డప్పు కళాకారులు నిరంతరంగా 75 గంటల పాటు డప్పు వాయించి కార్యక్రమాన్ని పూర్తి చేశారు.
ప్రపంచ రికార్డు ఘనతకు గుర్తింపుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ఆఫ్ ఇండియా సీఈఓ పవన్ సోలంకి సర్టిఫికెట్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పణతల సురేష్‌కు అందజేశారు. కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ తదితరులు హాజరయ్యారు. డప్పు కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంపై పవన్ సోలంకి హర్షం వ్యక్తం చేశారు.
బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పణతల సురేష్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ 75వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ముఖ్యమంత్రి నుంచి ప్రధానమంత్రి వరకు 25 సంవత్సరాల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న సంకల్ప అభియాన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మోదీకి బహుమతిగా ఈ డప్పు మారథాన్‌ను నిర్వహించినట్లు చెప్పారు.
గతంలో ఆస్ట్రేలియాలో 71 గంటల పాటు నిర్వహించిన డప్పు ప్రదర్శన గిన్నిస్ రికార్డులో ఉందని, దానిని అధిగమించేలా 75 గంటల పాటు డప్పు మారథాన్ నిర్వహించినట్లు పణతల సురేష్ తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన స్థానిక అధికార యంత్రాంగం, నిర్వాహక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.
తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. గత 25 సంవత్సరాలుగా ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి హోదాల్లో మోదీ అందిస్తున్న పాలనతో భారత్ ప్రపంచ స్థాయిలో ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు.
75 గంటల డప్పు మారథాన్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా తిరుపతి నగరంలోని ప్రధాన మార్గాల్లో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని గంగమ్మ ఆలయం వద్ద పణతల సురేష్, మాజీ మంత్రి బాబు మోహన్‌ను పార్టీ శ్రేణులు భారీ గజమాలలతో సత్కరించారు.
కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఉదయ్, బసవరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి గవ్వల అశోక్, బీజేపీ నాయకుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్షులు, 2,000 మందికి పైగా డప్పు కళాకారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రపతికి స్వాగతం పలికిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



**విజయవాడ, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ స్థాయి సరస్ అజీవికా మేళా ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు విజయవాడకు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం విజయవాడ విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు.
అక్టోబర్ 15 నుంచి 31 వరకు నిర్వహించనున్న సరస్ అజీవికా మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. గ్రామీణ మహిళల్లోని నైపుణ్యాలు, సృజనాత్మకత, వ్యాపార సామర్థ్యాలను ప్రోత్సహించడంతో పాటు వారికి విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించడం ఈ మేళా ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు.
మేళాలో వివిధ రాష్ట్రాల సంప్రదాయ ఉత్పత్తులు, హస్తకళలు, ఆహార పదార్థాలతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాల విజయగాథలను ప్రదర్శించనున్నారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెట్ అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సరస్ అజీవికా మేళాలో పాల్గొంటున్న మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహాన్ని అందించనుందని నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామీణ మహిళల సాధికారత, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు.

## యడ్లపల్లి రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి నూతన పాలకవర్గం



### ○ నూతన పాలకవర్గం దేవస్థాన అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**చుండూరు, అక్టోబర్ 14 (జర్నలిస్ట్ ఫైల్):** చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలోని శ్రీ గంగా సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి నూతన పాలకవర్గాన్ని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు ప్రకటించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, దేవస్థాన నిర్వహణను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేలా పాలకవర్గం పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. నూతన పాలకవర్గం చైర్మన్‌గా ఆవుల దశరథరామయ్య, సభ్యులుగా ఆరుమళ్ల వీరయ్య చౌదరి, ముసునూరి స్వప్న మాధవి, కేశినేని జగన్మోహనరావు, తెల్లగోర్ల వెంకటేశ్వరమ్మ, అంబడిపూడి బాల త్రిపుర సుందరి, యామర్తి సత్యనారాయణ, అయోధ్య లెనిన్ బాబు, కొత్త కృష్ణమూర్తి నియమితులయ్యారు. ఆలయానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన పాలకవర్గం దేవస్థాన అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని నక్కా ఆనంద బాబు సూచించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు ఆలయ నిర్వహణలో సమన్వయంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. శ్రీ గంగా సమేత రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## పుట్టాకి దసరా శరన్నవరాత్రి ఆహ్వాన పత్రిక అందజేత



**ప్రొద్దుటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కి శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆర్యవైశ్య సభ అధ్యక్షులు అయ్యపు సురేష్ బాబు సూచనలతో దసరా శరన్నవ రాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేసిన బ్రహ్మంగారిమఠం ఆర్యవైశ్య సభ. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సుంకు సురేష్ బాబు,కోశాధికారి దుగ్గిశెట్టి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అమరావతి బ్రహ్మం యువజన సంఘం అధ్యక్షుడు యాదాళ్ళ వెంకటసుబ్బయ్య ఎగ్జిక్యూటివ్ మెంబెర్ పత్తి సురేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రతపై విద్యార్థులకు అవగాహన

### ○ నిర్మలా ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవ కార్యక్రమాలు




**మంగళగిరి, అక్టోబర్ 14(జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని నిర్మలా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (స్వయంప్రతిపత్తి)లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆహార భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'ఈరోజే నూతన ఆవిష్కరణలు చేయండి – రేపటి భవిష్యత్తుకు పోషణ అందించండి' అనే సందేశంతో అవగాహన స్టాళ్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.
కార్యక్రమానికి గుంటూరు జిల్లా ఫుడ్ కంట్రోలర్ ఎన్. పూర్ణ చంద్రరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ డి. నరసింహుండు ముఖ్య అతిథులుగా హాజరై అవగాహన స్టాళ్లను, ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ ఆహార భద్రత ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి, కుటుంబ సంక్షేమానికి, సమాజ ఆరోగ్య పరిరక్షణకు ఎంతో కీలకమని తెలిపారు. కల్తీ ఆహార పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని, ఆహార పదార్థాల నాణ్యతను గుర్తించి సురక్షితమైన ఆహారాన్ని ఎంచుకోవడంతో పాటు పరిశుభ్రతను పాటించాలని సూచించారు.
విద్యార్థులు ఆహార భద్రతపై అవగాహన పెంపొందించుకుని తమ కుటుంబాలు, సమాజంలో చైతన్యం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం, ఆహార వృథాను నివారించడం, రైతులను గౌరవించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.
కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన స్టాళ్లలో పోషకాహారం, సురక్షితమైన ఆహార వినియోగం, ఆహార పదార్థాల నాణ్యత తదితర అంశాలను ప్రదర్శనల ద్వారా వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఆహార భద్రతా కమిషనర్ కార్యాలయం జారీ చేసిన కరపత్రాలతో పాటు ఆహార కల్తీని గుర్తించే విధానాలపై రూపొందించిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.
అనంతరం విద్యార్థులు ఆహార భద్రతపై నినాదాలు చేస్తూ కళాశాల నుంచి ఆత్మకూరు హైవే జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'సురక్షిత ఆహారం –– ఆరోగ్యకరమైన జీవితం', 'ఆహార కల్తీని అరికడదాం – ప్రజల ఆరోగ్యాన్ని కాపాడదాం', 'ఆహారాన్ని వృథా చేయవద్దు' వంటి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. హైవే జంక్షన్ వద్ద విద్యార్థులు ఆహార భద్రత పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. రేఖా నరేష్‌బాబు, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ విభాగాధిపతి డా. జి. స్వప్న సమన్వయం చేశారు. విద్యార్థుల్లో ప్రజారోగ్యం, ఆహార భద్రత, సామాజిక బాధ్యతపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.
కార్యక్రమంలో ముఖ్య అతిథి పూర్ణ చంద్రరావును కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి సత్కరించారు. ఆహార భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.
కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థి సమన్వయకర్తలు ఎస్.కె. అస్మా, కె. కరుణాకర్, కె. కీర్తి, కె. నివేదిత స్ఫూర్తి, సి.హెచ్. నాగేశ్వరరావు, ఎం. రవి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. 'మంచి ఆహారం – మంచి ఆరోగ్యం – మెరుగైన భవిష్యత్తు' అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com